# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 46 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల మంగళవారం 20 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 46 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA TUE 20 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

- నేడు విజయదశమి
- చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా
- ఈ పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందన్న సీఎం చంద్రబాబు
- తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడి

- మిగతా 2లో



## సెలవు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు దసరా శుభాకాంక్షలు. దసరా పండుగ సందర్భంగా మంగళవారం పత్రికకు సెలవు. బుధవారం పునః ప్రారంభం.

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

## సీఎం చంద్రబాబు పిలుపు

- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి



సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు.

పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ-ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని,

- మిగతా 2లో



## 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయండి

## ఈసీకి వైసీపీ వినతి

- 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయాలని ఈసీని కోరిన వైసీపీ
- టీడీపీ దాడులతో నామినేషన్లు వేయలేకపోయామని ఆరోపణ
- హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషనర్‌కు వీడియో ఆధారాలు అందజేత
- 488 వార్డుల్లో అభ్యర్థులు లేకుండా పోయారని ఫిర్యాదులో వెల్లడి
- కుప్పం ఛైర్మన్ అభ్యర్థి కిడ్నాప్ అయ్యారని, పలువురిపై దాడులు జరిగాయని ఆందోళన

రాష్ట్రంలోని 22 పట్టణ స్థానిక సంస్థల్లో కొత్తగా నామినేషన్లు స్వీకరించాలని లేదా ఎన్నికలను వాయిదా వేయాలని వైసీపీ నేడు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) కోరింది. అధికార టీడీపీ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ తమ అభ్యర్థులను

- మిగతా 2లో




## ఎడిటర్ వ్యూ

### ఏపీ లోకల్ వార్... స్నేహపూర్వక పోటీ తప్పట్లేదే... !

రాష్ట్రంలో కూటమి పార్టీల మధ్య సఖ్యత బాగానే ఉన్నప్పటికీ.. స్థానిక ఎన్నికల్లో మాత్రం స్నేహ పూర్వక పోటీ తప్పేలా కనిపించడం లేదు. ఉత్తరాంధ్ర నుంచి సీమ వరకు జనసేన నాయకులు ఎక్కడా తగ్గలేదు. అధికారికంగా పార్టీకి 4 కార్పొరేషన్లు, 21 మునిసిపాలిటీలే దక్కినా.. క్షేత్రస్థాయి నాయకులు, పార్టీ కోసం పనిచేసిన వారు మాత్రం సై అంటూ ఈ ఎన్నికల్లో సీట్ల కేటాయింపుతో సంబంధం లేకుండానే రంగంలోకి దిగారు. దీంతో ఆయా స్థానాల్లో మిత్ర బేధం రాకుండా.. స్నేహ పూర్వక పోటీ చేయడమే మంచిదన్న భావన వ్యక్తమవుతోంది.

**ఎక్కడెక్కడ ?**

మూడుచోట్ల మేయర్ స్థానాలకు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్ స్థానాలకు.. టీడీపీ-జనసేన, బీజేపీ-జనసేన, టీడీపీ-బీజేపీల మధ్యే పోరు సాగనుంది. ఆయా పార్టీలనేతలు కాదు కాదంటూనే నామినేషన్లు వేసేశారు. అదేమంటే తమకు బలం ఉన్న స్థానాలను వేరే పార్టీలకు కేటాయించారని కూడా చెబుతున్నారు. ఇక,ఒకటి రెండు స్థానాల్లో అయితే.. ఒకే పార్టీకి చెందిన నాయకులు ఇద్దరి నుంచి ముగ్గరు వరకు పోటీ పడుతున్నా రు. ఈ పరిణామాలు.. ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. నాయకుల మధ్య ఉన్న ఆకాంక్షకు అద్దం పడుతున్నాయి.ముఖ్యంగా విజయనగరం కార్పొరేషన్ మేయర్ పదవికి టీడీపీ, జనసేన పోటీ పడుతున్నాయి. వాస్తవానికి టీడీపీకే కేటాయించినా.. జనసేన మాత్రం తగ్గేది లేదంటూ పోటీకి దిగింది. ఇక, డివిజన్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పది డివిజన్లలో జనసేన నామినేషన్ వేసింది. ఏలూరు కార్పొరేషన్ జనసేనకు కేటాయించగా టీడీపీ అభ్యర్థి కూడా మేయర్ పీఠానికి నామినేషన్ వేశారు. విశాఖ కార్పొరేషన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మరో కీలకమైన విజయవాడ కార్పొరేషన్ పరిధిలోనూ జనసేన, టీడీపీలు వార్డుల వారీగా నామినేషన్లు వేశాయి.

**ఏం చేయాలి ..?**

ఇలా కూటమి పార్టీల నాయకులే విరివిగా నామినేషన్లు వేయడంతో అనివార్యంగా పోటీ తప్పకపోవచ్చు. ఇలాంటి సమయంలో నామినేషన్లను ఉపసంహరించుకునేలా నాయకులను బుజ్జగించడం తొలి మార్గం. అప్పటికీ సాధ్యం కాకపోతే.. పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం. అది కూడావర్కవుట్ అవకపోతే.. స్నేహపూర్వకంగానే ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. మంచి-చెడులను ప్రజలే తేలుస్తారు. మొత్తంగా.. ఆయా ప్రాంతాల్లో స్నేహ పూర్వక పోటీ తప్పదన్న సంకేతాలు అయితే వస్తున్నాయి. అయితే.. ఉపసంహరణకు గడువు ఉన్న నేపథ్యంలో ఏం చేస్తారన్నది చూడాలి.

### ఒక్క ఓటు కూడా చీలకూడదు.. విజయవాడలో వంగవీటి రాధాను గెలిపించుకుందాం

- మొదటి పేజి తరువాయి

రాధా అభ్యర్థిత్వంపై టీడీపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లుగా సాగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది.ఈ మేరకు టీడీపీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందరూ చూస్తున్నారు. ఇప్పుడు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా కూటమి అభ్యర్థినే గెలిపించుకుందాం," అని పిలుపునిచ్చింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా బరిలో నిలిపిన వంగవీటి రాధాకృష్ణను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరింది.
కులాల పేరుతో రెచ్చగొట్టి ఓట్లు చీల్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని టీడీపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. "కులం పేరుతో ఎవరు ఎన్ని విధాలుగా రెచ్చగొట్టినా కూటమి ఓటు చీలకుండా మన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించుకుందాం. కులతత్వం రెచ్చగొడుతున్న వారికి దీటుగా సమాధానం ఇద్దాం" అని పార్టీ శ్రేణులకు, ప్రజలకు స్పష్టం చేసింది. రాధా గెలుపు కోసం కూటమిలోని మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయని, ఆయన విజయంతో విజయవాడ కార్పొరేషన్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ భరోసా ఇచ్చింది.

### అమెరికాలోని ప్రతి పిల్లాడికీ స్పేస్‌ఎక్స్ షేరు..

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ ఆంథ్రోపిక్.. కంపెనీలోని 5 శాతం వాటాను ప్రజాప్రయోజనాల కోసం తాను ఏర్పాటు చేసే నిధికి కేటాయించనున్నట్లు ప్రకటించిన వేళ ఎలాన్ మస్క్ స్పందిస్తూ ఈ ప్రకటన చేశారు.'ఆంథ్రోపిక్ పబ్లిక్ బెనిఫిట్ ఫండ్' ను ఏర్పాటు చేసి సంస్థలో 5 శాతం వాటాలను ఈ నిధికి కేటాయిస్తామని ఆంథ్రోపిక్ ప్రకటించింది. సంస్థ విలువ 50 శాతం పెరిగిన ప్రతిసారీ మరో 2 శాతం వాటాలను అదనంగా కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ నిధి ద్వారా స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందించడంతో పాటు అవసరమైన వర్గాలకు ఆర్థిక సాయం చేయనున్నారు. అదేవిధంగా ఏఐ వల్ల ఉద్యోగ రంగంలో వచ్చే మార్పులు, కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారించనున్నట్లు ఆంథ్రోపిక్ తెలిపింది.ఈ ప్రకటనపై మస్క్ స్పందిస్తూ.. వాటాలను ప్రజానిధికి చేరవేసే బదులు.. నేరుగా ప్రజలకే ఇవ్వాలని ఎక్స్ వేదికగా సూచించారు. 'నేను కూడా భవిష్యత్‌లో ఇదే చేయబోతున్నా' అని ప్రకటించారు. ఏ కంపెనీ షేర్లు అనేది తొలుత వెల్లడించనప్పటికీ.. తర్వాత స్పేస్‌ఎక్స్‌లో ఒక్కో షేరును ప్రతి పిల్లాడికీ కేటాయించనున్నట్లు మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత స్పేస్ ఎక్స్ షేరు ధర 146.03 డాలర్లు ఉంది.

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

**చెప్పాం.. చేస్తున్నాం..**

2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.
విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ**

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు.

**గొడ్డలి పార్టీ అధ్యక్షుడు**

తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్-జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్-జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు.
గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

## 22 మున్సిపాలిటీల్లో ఎన్నికలు వాయిదా వేయండి

నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ నేతల బృందం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసింది.వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, నారాయణమూర్తి తదితరులు కమిషనర్‌ను కలిసి దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను, మూడు వినతిపత్రాలను సమర్పించారు. అనంతరం అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఓటమి భయంతోనే టీడీపీ కార్యకర్తలు తమ నామినేషన్ పత్రాలను చించివేశారని, కొన్నిచోట్ల పోలీసులు వారికి సహకరించగా, మరికొన్ని ప్రాంతాల్లో పోలీసులే స్వయంగా పత్రాలను లాక్కున్నారని ఆరోపించారు.ఈ 22 పురపాలక సంఘాల్లో మొత్తం 809 వార్డులు/డివిజన్లు ఉండగా, కేవలం 321 చోట్ల మాత్రమే తమ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగలిగారని వైసీపీ వివరించింది. మిగిలిన 488 చోట్ల తమ పార్టీ తరఫున అభ్యర్థులే లేకుండా చేశారని, 8 మున్సిపల్ ఛైర్మన్ పదవులకు కూడా నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని తెలిపింది. మైదుకూరులో 19 నామినేషన్ పత్రాలను చించివేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం అక్కడ ఎన్నికలను వాయిదా వేసిందని, అదే తరహా చర్యలు ఈ 22 ప్రాంతాల్లోనూ తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎంపీలు మిథున్ రెడ్డి, గురుమూర్తి, అవినాశ్ రెడ్డిపై జరిగిన దాడులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆత్మకూరు, కనిగిరిలో స్క్రూటినీ కేంద్రాల్లోనే నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. ప్రొద్దుటూరు, కుప్పంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయని, కుప్పంలో ఛైర్మన్ అభ్యర్థి విజయ్ కుమార్ అపహరణకు గురయ్యారని, ఆయన ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అపహరణకు గురైన అభ్యర్థులను వెంటనే కాపాడి, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు.సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని, హింసకు పాల్పడిన టీడీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని, వారికి సహకరించిన అధికారులను ఎన్నికల విధుల నుంచి తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి మేయర్ అభ్యర్థి వాసు యాదవ్ బీసీ సర్టిఫికెట్ల అంశాన్ని నిబంధనల ప్రకారం, ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా పరిశీలించాలని కోరారు. ఏకగ్రీవాలను ప్రకటించే ముందు బాధితులైన తమ అభ్యర్థులకు మరోసారి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.

## రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు.. ఇదేం పైశాచిక ఆనందం?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వేసిన రోడ్డును కొందరు ట్రాక్టర్‌తో దున్నేశారని, ఇది వారి పైశాచిక ఆనందానికి, ఉన్మాదానికి నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈరోజు టీవీలో చూశాను. మేం రోడ్లు వేస్తే, ఆ రోడ్డును ట్రాక్టర్‌తో దున్నేశారు. ఇది భరించలేక చేస్తున్నారా, లేక ఉన్మాదమో, పైశాచిక ఆనందమో నాకు అర్థం కావడం లేదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఓవైపు తాము అభివృద్ధి, జవాబుదారీ పాలన అందిస్తుంటే, మరోవైపు కొందరు విధ్వంసానికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 55 రకాల సేవలను అందిస్తోందని, ఆర్టీసీ బస్సులు, ఆసుపత్రులు, అన్నా క్యాంటీన్లు, రేషన్ షాపుల వరకు ప్రతి సేవపైనా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, అధికారుల పనితీరును సమీక్షిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో అధికారుల ముందే వారి పనితీరుపై ప్రజల అభిప్రాయాలను చదివి వినిపిస్తూ, తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నామని, ఇంతకంటే జవాబుదారీతనం ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు.
రాజకీయ విధ్వంసం కారణంగా కోల్పోయిన 'బ్రాండ్ ఏపీ'ని మళ్లీ పునరుద్ధరించి, పెట్టుబడులకు రాష్ట్రాని నంబర్ వన్ గమ్య స్థానంగా తీర్చిదిద్దామని చంద్రబాబు అన్నారు. గత రెండున్నర ఏళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, ఇవి పూర్తయితే 20 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి నాంది పలికామని, దీనివల్ల కరవు పరిస్థితుల్లోనూ నీటి సమస్య ఉండదని చెప్పారు.మెగా డీఎస్సీ విషయంలో ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరును చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "పేద పిల్లలకు ఉద్యోగాలు రాకుండా ఉండేందుకు సుమారు 200-300 సార్లు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. మేం పట్టుబట్టి ఉద్యోగాలు ఇస్తే, మాపైనే ఆరోపణలు చేశారు. నిజం నిప్పు లాంటిది. దానితో ఆడుకుంటే మసైపోతారే తప్ప నిలవలేరు" అని హెచ్చరించారు. ఒకప్పుడు ఎడారిగా మారుతుందనుకున్న రాయలసీమ, నేడు తమ ప్రభుత్వ కృషితో 'రాయలసీమ రైజింగ్'గా ఎదుగుతోందని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆకలి కేకలు.. నివేదికలో షాకింగ్ విషయాలు!

ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న టాప్ 10 దేశాల జాబితాలో పాకిస్థాన్ చేరింది. ఆర్థిక ఒత్తిళ్లు, వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలు, సహాయం అందడంలో తగ్గుదల వంటి కారణాలతో ఆ దేశంలో ఆహార అభద్రత రోజురోజుకు తీవ్రమవుతోందని ఒక నివేదిక హెచ్చరించింది. 'ప్రాఫిట్ బై పాకిస్థాన్ టుడే' విశ్లేషణ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 47 దేశాల్లో 266 మిలియన్ల మంది తీవ్రమైన ఆకలితో అల్లాడుతున్నారు. ఈ సంఖ్య దశాబ్దం క్రితంతో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం.తీవ్ర ఆహార సంక్షోభంతో బాధపడుతున్న వారిలో దాదాపు మూడింట రెండొంతుల మంది, అంటే సుమారు 177 మిలియన్ల ప్రజలు కేవలం పది దేశాల్లోనే ఉన్నారు. ఆ జాబితాలో పాకిస్థాన్‌తో పాటు ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, నైజీరియా, కాంగో, సూడాన్, యెమెన్, మయన్మార్, దక్షిణ సూడాన్, సిరియా ఉన్నాయి. జనాభా శాతంతో కాకుండా, ఆకలితో బాధపడుతున్న ప్రజల సంఖ్య ఆధారంగా పాకిస్థాన్‌ను ఈ జాబితాలో చేర్చినట్లు నివేదిక స్పష్టం చేసింది.
పాకిస్థాన్‌లోని 51 గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 1.06 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బలహీన వర్గాలు వాతావరణ మార్పుల ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నాయి. 2018-19లో 15.92 శాతంగా ఉన్న మధ్యస్థ, తీవ్ర ఆహార అభద్రత కలిగిన కుటుంబాల సంఖ్య, 2024-25 నాటికి 24.35 శాతానికి పెరిగింది. అంటే.. ప్రస్తుతం దేశంలో దాదాపు ప్రతి నాలుగు కుటుంబాల్లో ఒక కుటుంబం ఆహార కొరతతో ఇబ్బంది పడుతోంది. ఇదే సమయంలో తీవ్రమైన ఆహార అభద్రత 2.37 శాతం నుంచి 5.04 శాతానికి పెరిగి రెట్టింపయింది. పాకిస్థాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (పీబీఎస్) గణాంకాల ప్రకారం.. జూన్ 2019 నుంచి జూన్ 2025 మధ్య కాలంలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) 117 శాతం పెరగడం ఆర్థిక ఒత్తిళ్లకు అద్దం పడుతోంది. దీనికి తోడు వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గి, గ్రామీణ కుటుంబాల ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో ప్రజలు ఆహారం కోసం మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. ఈ కాలంలో ప్రజలు గోధుమలు, బియ్యం, పప్పులు, మాంసం, గుడ్లు, పాల వినియోగాన్ని తగ్గించారని, అయితే వనస్పతి నెయ్యి వాడకం మాత్రం 81 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. ఆదాయం తగ్గడం, ధరలు పెరగడం వంటి కారణాలతో పాక్‌లో ఆహార లభ్యత, కొనుగోలు సామర్థ్యం రెండూ దెబ్బతిన్నాయి.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

- మొదటి పేజి తరువాయి

కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు.రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు."మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు.గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

నేడు (అక్టోబరు 20) విజయదశమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ మేరకు చంద్రబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతన్నల శ్రమకు తగిన ఫలితం, మహిళలకు సాధికారత, యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు."ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

### హైదరాబాద్‌లో హనీట్రాప్

- మొదటి పేజి తరువాయి

బ్లాక్‌మెయిల్ చేసిన పవన్ అనే నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి వలలో వందలాది మంది బాధితులు చిక్కుకున్నట్లు పోలీసులు గుర్తించా రు.పవన్ అనే యువకుడు వాట్సాప్‌లో యువతి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, ఒక పోలీసు అధికారితో స్నేహం చేశాడు. చాటింగ్ ద్వారా కొంతకాలం నమ్మకాన్ని కలిగించిన అనంతరం, సదరు అధికారిని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేయడం ప్రారంభించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన సైదాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే సోమవారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి, అతని నేర చరిత్రను వివరించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను విశ్లేషించగా వేల సంఖ్యలో వాట్సాప్ చాటింగ్‌లు లభ్యమయ్యాయి. అతని బాధితుల జాబితాలో వందలాది మంది ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.నిందితుడి మోసాల పరిధి కేవలం తెలంగాణకే పరిమితం కాలేదని, ఇతర రాష్ట్రాలతో పాటు దుబాయ్ వంటి విదేశాల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నపోలీసులు, ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

### నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాల్‌దుహోమాను శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు.ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఎన్నికలకు రికార్డు స్థాయిలో 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్టీ, ప్రతి వర్గం, నలుమూలల నుంచి అభ్యర్థులు ముందుకు రావడం ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందనడానికి నిదర్శనమని అన్నారు.ఒక్క ఓటు కూడా పడకముందే అక్రమాలు జరిగాయని ఆరోపించే వారు ఒక విషయం గుర్తుంచుకోవాలని లోకేశ్ హితవు పలికారు. "ఎన్నికల్లో గెలుపు క్షేత్రస్థాయిలో ఉంటుంది కానీ, పత్రికా సమావేశాల్లో కాదు. ప్రజలను ఎదుర్కోండి, ప్రజలే ఫలితాలను నిర్ణయిస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే.

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు.. కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు.కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

## పేట మండలం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం : ఎన్నికల అధికారిణి బి.లీలారాణి



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 19 :**

చిలకలూరిపేట మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఎన్నికల అధికారిణి లీలారాణి వెల్లడించారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణపై ఆమె పలు కీలక విషయాలను వివరించారు.

అక్టోబర్ 21 వ తేదీ నుండి నామినేషన్లు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 21వ తేదీ నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుందని అధికారిణి తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ముందస్తుజాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ అదనపు పోలీసు బలగాలతో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రలోభాలకు గురికాకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని లీలారాణి తెలిపారు. ఈ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

**పెన్ పవర్**
**సెంట్రల్ ఆంధ్ర**
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# తెనాలిఎన్నికలకౌంటింగ్,సామగ్రిపంపిణీ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 19,**



తెనాలి పురపాలక ఎన్నికల నిర్వహణకు సంబంధించి కౌంటింగ్, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ సోమవారం పరిశీలించారు.తెనాలిలోని జె.ఎం.జె కళాశాల, నన్నపనేని వెంకటరావు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వార్డుల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, ప్రతి కౌంటర్ వద్ద తగినంత మంది సిబ్బందిని నియమించాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రి స్వీకరణ కూడా క్రమబద్ధంగా జరగాలని, సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత, సీసీ కెమెరాలు, కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, ఎన్నికలకు సంబంధించిన సందేహాలు లేదా ఫిర్యాదుల కోసం 08632 234014 హెల్ప్‌డెస్క్ నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

**ఎన్నికల వేళ మద్యం దుకాణాలు బంద్**

ఎన్నికలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల పాటు, అలాగే ఓట్ల లెక్కింపు రోజున సంబంధిత ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలను పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. ఈ నిబంధనల అమలులో రెవెన్యూ, ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ పరిశీలనలో తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, తెనాలి ఎంపీటీసీ రిటర్నింగ్ అధికారి కే. దుర్గాబాయి, తెనాలి డీఎస్పీ మురళీకృష్ణ, తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ కలెక్టర్ .ఎం. సాయికాంత్ వర్మ

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 19,**



గుంటూరు జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలో రాజకీయపార్టీలప్రతినిధులతోనిర్వహించిన సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, 27న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, 50 ఎస్ఎస్‌టీ, 50 ఎఫ్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సందేహాల కోసం 08632 234014 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 19,**




విజయవాడలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకుఅన్నిముందస్తుఏర్పాట్లుపకడ్బందీగా చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు,ఎన్నికలపరిశీలకులతోసమీక్షనిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నియమావళి అమలు, ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగింపువరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఎన్నికలవిధుల్లోపాల్గొనేఅధికారులుబాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, ఎన్నికల ఖర్చులకు సంబంధించిన ఫిర్యాదులపై నిరంతరం నిఘా ఉంచాలని, అందిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎన్నికల సాధారణ పరిశీలకులు నాగలక్ష్మి, వ్యయ పరిశీలకులు శివప్రసాద్‌లను ప్రజలు, రాజకీయ పార్టీలప్రతినిధులుఎన్నికలకుసంబంధించిన ఫిర్యాదుల కోసంనేరుగాసంప్రదించవచ్చనితెలిపారు.

క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ స్థానికసంస్థలఎన్నికలనువిజయవంతంగానిర్వహించేందుకు అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ కోరారు.ఈ సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు నాగలక్ష్మి, వ్యయ పరిశీలకులు శివప్రసాద్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యాన్‌చంద్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గుంటూరు కార్పొరేషన్‌ను భారీ మెజారిటీతో కైవసం చేసుకుంటాం





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 19,**

గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ధీమా వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని ఆమె పేర్కొన్నారు.సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లి'చెప్పాం.. చేస్తున్నాం'లి పోస్టర్‌ను గళ్ళా మాధవి, ఎన్డీయే కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ.. రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రైతులు, మహిళలు, యువత, పిల్లలు సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు అవకాశం కల్పించడం సంతోషకరమని తెలిపారు.కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, అన్ని వార్డుల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేస్తారని చెప్పారు. ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం గుంటూరు నగరాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.

మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ.. మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తనకు మేయర్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తల సహకారంతో భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గుంటూరు నగర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.




# 21న పోలీసు అమరవీరుల దినోత్సవం



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 19 :**
పోలీసు అమరవీరుల దినోత్సవం ఈ నెల 21వ తేదీన జరగనుంది. మంగళగిరి 6వ ఏపిఎస్పీ బెటాలియన్ మైదానంలో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ సోమవారం తనిఖీ చేశారు. అతిథులు, పోలీసు అమరవీరుల కుటుంబాలు పాల్గొననున్నాయి. అవసరమగు వేదిక, కూర్చునే సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య శిబిరాలు, తాగు నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు ఉండాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.టి.వి రవి కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మక్కెన పద్మావతి, పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాలుష్యంలేని దీపావళి జరుపుకుందాం - కలెక్టర్ సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 19:**
దీపావళి టపాసుల విక్రయాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి, టపాసుల విక్రయాలకు సురక్షితమైన మైదానాలను గుర్తించాలని సూచించారు. అనుమతులకు మించి టపాసుల నిల్వలు ఉంచరాదని, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజలందరూ కాలుష్యంలేని దీపావళిని జరుపుకోవాలని కలెక్టర్ కోరారు. టపాసుల వల్ల వాయు, శబ్ద కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.
జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, టపాసుల విక్రయ కేంద్రాల వద్ద విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండేలా చూడాలని, అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుంటూరు 30వ వార్డులో జనసేన అభ్యర్థిగా ఆళ్ళ శిరీష నామినేషన్ దాఖల

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 19,**
గుంటూరు నగరంలోని 30వ వార్డు నుంచి కూటమి ప్రభుత్వం బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిగా ఆళ్ళ శిరీష నామినేషన్ దాఖలు చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని ఆళ్ళ శిరీష పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే కూటమి అభ్యర్థుల విజయానికి దోహదపడతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. 30వ వార్డు ప్రజల మద్దతుతో విజయం సాధించి వార్డు అభివృద్ధికి




కృషి చేస్తానని ధీమాను ఆళ్ళ శిరీష వ్యక్తం చేశారు.

# ముగిసిన నామినేషన్ల ఘట్టం.. మొదలైన పరిశీలన

## పేటలో ప్రశాంతంగా నామినేషన్ల పరిశీలన: పకడ్బందీ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీహరి బాబు, సీఐ రమేష్



**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 19 :**
చిలకలూరిపేట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిన్నటితో ముగిసింది. నేటి నుంచి నామినేషన్ల పరిశీలన, ఆ తర్వాత ఉపసంహరణ ఘట్టం ప్రారంభమైంది. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు అధికారులు ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో కమిషనర్ శ్రీహరి బాబు, సీఐ రమేష్ పర్యవేక్షణ**
నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు, అర్బన్ సీఐ పి. రమేష్ ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లను వీరిరువురు స్వయంగా పరిశీలిస్తూ, ఎన్నికల సిబ్బందికి ఎప్పటికప్పుడు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. మున్సిపాలిటీ, పోలీస్ శాఖల మధ్య సమన్వయం ఉండేలా వీరు ముందుండి నడిపిస్తున్నారు.

**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు**
ఈ కీలక ఘట్టంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అర్బన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షిస్తూ, ఎన్నికల ప్రక్రియను అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు. వీరితోపాటు అర్బన్ ఎస్ఐ హాజరత్తయ్య, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

# ఎనిమిది టన్నుల భారీ లడ్డు తయారీ.. రత్న బేకరీ ప్రత్యేకత. ప్రత్తిపాటి పుల్లారావు

**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 19 :**
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చిలకలూరిపేటలో ఎనిమిది టన్నుల భారీ లడ్డును తయారుచేయడంజరిగిందనిమాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గుంటూరులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం కోసం ఈ భారీ లడ్డును ప్రత్యేకంగా రూపొందించారు.చిలకలూరిపేట పట్టణంలోని దశాబ్దాలుగా మంచి పేరున్న 'రత్న బేకర్స్' ప్రొప్రైటర్ నాగేశ్వరరావు మరియు వారి కుమారుడు అభిషేక్ ఆధ్వర్యంలో ఈ ఎనిమిది టన్నుల లడ్డు తయారీ ప్రక్రియ ఎంతో శ్రమతో కూడుకున్నదని ఆయన కొనియాడారు. ఈ అద్భుతమైన కార్యక్రమానికి డి.ఎన్.డి. సురేష్ స్పాన్సర్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా చిలకలూరిపేటలో బ్రాండెడ్‌గా కొనసాగుతున్న రత్న బేకరీస్ ల్యాండ్‌మార్క్‌ను ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తీసుకువెళ్లారని ప్రత్తిపాటి పుల్లారావు ప్రశంసించారు. గుంటూరులో ప్రజల సందర్శనార్థం ఈ లడ్డును ప్రత్యేక ర్యాలీ నిర్వహించి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానానికి



సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకను విజయవంతంగా తయారు చేసిన నాగేశ్వరరావు మరియు అభిషేక్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# విజయవాడలో దసరా మహా కార్నివాల్.. రేపు ట్రాఫిక్ మళ్లింపులు

**విజయవాడ, పెన్ పవర్,అక్టోబర్ 19:**
దసరా శరన్నవరాత్రుల ముగింపు ఉత్సవాల్లో భాగంగా విజయవాడ నగరంలో రేపు, అక్టోబర్ 20న నిర్వహించనున్న మహా కార్నివాల్ కార్యక్రమం నేపథ్యంలో నగర పోలీసు శాఖ ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టింది. ఏలూరు రోడ్డులోని ఎస్ఆర్ఆర్ కళాశాల నుంచి చుట్టుగుంట కూడలి మీదుగా విశాలాంధ్ర రోడ్డులోని ఇందిరాగాంధీ మైదానం వరకు ఈ కార్యక్రమం జరగనుంది.ఈ వేడుకలకు ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.రేపు ఉదయం 9 గంటల నుంచి నగరంలోని ఆర్టీసీ బస్సులకు పాక్షికంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పూర్తిస్థాయిలో దారి మళ్లింపులు అమల్లో ఉంటాయి. రామవరప్పాడు వలయం నుంచి ఏలూరు రోడ్డు మీదుగా వచ్చే బస్సులను పడవలరేవు కూడలి, బీఆర్టీఎస్ రోడ్డు, సీతన్నపేట గేటు, ఏలూరు లాకులు, స్వర్ణ ప్యాలెస్



మీదుగా పండిట్ నెహ్రూ బస్సు నిలయం వైపు మళ్లిస్తారు.అదేవిధంగా బస్సు నిలయం నుంచి ఏలూరు రోడ్డు వైపు వెళ్లే బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించనున్నారు. అవసరాన్ని బట్టి రామవరప్పాడు వలయం, బెంజ్ కూడలి, మహానాడు కూడలి మీదుగా బస్సులు ప్రయాణించేలా ఏర్పాట్లు చేశారు.మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దీప్తి కూడలి నుంచి పడవలరేవు కూడలి వరకు ఏలూరు రోడ్డులో ద్విచక్ర వాహనాలు,



కార్లు సహా ఇతర వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. ఈ మార్గంలో ఇరువైపులా వాహనాలకు అనుమతి ఉండదు.కావున నగర ప్రజలు రేపు ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ మళ్లింపులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసు శాఖ సూచించింది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరింది.

# జగన్మోహన్ రెడ్డి ముందు మీ పార్టీ నేతల వ్యవహారాలపై సమాధానం చెప్పండి రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 19,**
తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రెస్‌మీట్‌లు పెట్టి మాట్లాడటం కాదు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి వ్యవహారాలపై మీ వైఖరి ఏమిటో నిజాయితీ ఏందో ప్రజలకు చెప్పండి
జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ నియోజకవర్గంలోఅయినా సరే నామినేషన్ వేయటానికి కూడా నామినేషన్ వేయటానికి కూడా భయపడే విధంగా జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేశారు, నామినేషన్ వేయటానికి బయలుదేరితే కిడ్నాప్ చేశారు, హత్యలు చేశారు, దౌర్జన్యాలు చేశారు, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రతి గ్రామము ఏకగ్రం కావాలి అన్నారు, గ్రామానికి 10 లక్షల రూపాయలు ఇస్తానన్నాడు, అలాంటి దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి, గతంలో నీ పాలనలో జరిగిన దాడులు, దౌర్జన్యాలను ప్రజలు మర్చిపోలేదు. ఈరోజు మాత్రం ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని మేము కోరుతున్నాం లక్ష్మయ్య అన్నారు, నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి



బడుగు, బలహీన వర్గాలపై దాడులు ఆపండి. మీ పార్టీ నాయకులను రెచ్చగొట్టడం మానుకోండి. సింహాలు, పులులమని మాటలు చెప్పడం కాదు.. నీవు పిల్లి అని అందరికి తెల్సు, ప్రజాస్వామ్యంపై నీకు ఎంత గౌరవం ఉందో ప్రజలందరి తెల్సు, చంద్రబాబు నాయుడుకి పవన్ కళ్యాణ్ కి ఎక్కడ మంచి పేరు వస్తుందో అని జగన్ మోహన్ రెడ్డి పంజాబ్ నుంచి రౌడీలను తీసుకువచ్చి గన్ ఇచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయటానికి సిద్ధమయ్యారు ఇలాంటి దుర్మార్గాన్ని ప్రజలు సీ కొడుతున్నారు, సజ్జల రామకృష్ణారెడ్డి ప్రెస్మీట్లోచెబుతున్నాడు మేము అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడ సంఘటన జరగలేదని రామకృష్ణారెడ్డి మీకు దమ్ము ధైర్యం ఉంటే నీకు వీడియోలు చూపిస్తాం మీ పరిపాలనలో సర్పంచులు గాని జడ్పీసీలు గాని ఎంపీటీసీలు గాని ఏ విధంగా చేశారు మీ నాయకులు నీకు బుద్ధి జ్ఞానం లేక ఆ విధంగా మాట్లాడుతున్నావ్ ప్రజల సొమ్ము దోచుకొని ప్రజల రక్తాన్ని తాగినోడు ఇంత గొడవలు జరగలేదా అది నోరో తాటి మట్ట ఏం మాట్లాడుతున్నావ్ సజ్జల నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు జాగ్రత్తగా మాట్లాడు అధికారుల్ని అబ్బ జాగిర్ కాదు అది తెలుసుకో మీరు అధికారంలో ఉన్నప్పుడు పోలీసులు అధికారులు ఏ విధంగా ఏడిచారు ఉద్యోగస్తులు ఏ విధంగా హింస పెట్టారు నెలల జీతం ఇచ్చారా
ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘానికి, సంబంధిత అధికారులకు, పోలీస్ శాఖకు మా హృదయపూర్వక ధన్యవాదాలు.ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉన్నవారు కూడా ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కోరుతున్నాం.దౌర్జన్య రాజకీయాలకు స్వస్తి పలకాలి.. ప్రజాస్వామ్యమే గెలవాలని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**28 జెడ్పీటీసీ, 419 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు**
**ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంయుక్త కలెక్టర్ సంజనా శ్రీహర్ష**

**నరసరావుపేట, పెన్ పవర్, అక్టోబర్ 19:**
పల్నాడు జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను పారదర్శకంగా,నిష్పక్షపాతంగా,ప్రశాంతవాతావరణం లో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా సంయుక్త కలెక్టర్ సంజనా శ్రీహర్ష తెలిపారు. సోమవారం సాయంత్రం నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సంజనా ఎన్నికల షెడ్యూల్, ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించారు.
జిల్లాలో మొత్తం 28 జెడ్పీటీసీ, 419 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో సుమారు 12 లక్షల 42 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు.

**అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ**
రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని సంయుక్త కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 21వ తేదీ నుంచి 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఎంపీటీసీ స్థానాలకు సంబంధిత మండలాల్లో నియమించిన రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు



స్వీకరిస్తారని, జెడ్పీటీసీ స్థానాలకు నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో తాను నామినేషన్లు స్వీకరిస్తానని వివరించారు.అక్టోబర్ 24వ తేదీన నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తామని, తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు అక్టోబర్ 25వ తేదీన అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీటీసీ అభ్యర్థులు సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో, జెడ్పీటీసీ అభ్యర్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అప్పీల్ దాఖలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అక్టోబర్ 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

**నవంబర్ 3న పోలింగ్.. 5న ఓట్ల లెక్కింపు**
ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు సంయుక్త కలెక్టర్ వెల్లడించారు. నవంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు.

**1,548 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**
జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 1,548 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు సంజనా శ్రీహర్ష తెలిపారు. వీటిలో 706 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 488 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామని పేర్కొన్నారు.

**ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక నిఘా**
ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు ప్రతి మండల స్థాయిలో స్థిర నిఘా బృందాలు, ఎగిరే తనిఖీ బృందాలు, ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా బృందాలకు అవసరమైన అధికారాలు అప్పగించి, ఎన్నికల సమయంలో అక్రమాలకు తావులేకుండా పర్యవేక్షణ చేపడుతున్నట్లు వెల్లడించారు.జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాల ద్వారా 24 గంటల పాటు తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.
ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల అధికారులకు సంపూర్ణ సహకారం అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంయుక్త కలెక్టర్ సంజనా శ్రీహర్ష విజ్ఞప్తి చేశారు.

# స్థానిక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో పటిష్ట నిఘా.

**చిలకలూరిపేట రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక చెక్‌పోస్టులు..వాహనాల ముమ్మర తనిఖీలు.**

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, అక్టోబర్ 19 :**
చిలకలూరిపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా సరిహద్దుల్లో పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా తాతపూడి జాతీయ రహదారి,యూటీసెంటర్,మిట్టపాలెం,ఈవూరివారిపాలెం జంక్షన్ ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు.తాతపూడి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు.ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం,




ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.
ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం లేదా ఇతర అక్రమ వస్తువులను తరలిస్తే ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమంగా తరలించే సామగ్రిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.ఎన్నికలు ప్రశాంతంగా,పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# ప్రత్తిపాడు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం -- ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 19,**

గుంటూరునియోజకవర్గక్యాంపుకార్యాలయంలోకూటమిప్రభుత్వంచేపట్టినఅభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో రూపొందించిన "చెప్పాము...చేస్తున్నాము...ప్రజలకు చూపిస్తున్నాము" పోస్టర్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు ఆవిష్కరించారు.గత రెండేళ్ల నాలుగు నెలల్లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మూడు ప్రధాన అంశాలుగా ప్రజల ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాలు, సూపర్ సిక్స్ పథకాల ద్వారా కుటుంబాలకు అందించిన లబ్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామనివివరించారు.నియోజకవర్గంలోఇప్పటివరకం 1,889 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, మరో 799 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మూడు ఉద్యోగ మేళాల ద్వారా 1,338 మందికి ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు.సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనాలు అందిస్తున్నామని, 35 వేల మందికి పైగా లబ్ధిదారులకు ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు పింఛన్ల కోసం రూ.388 కోట్లు, తల్లికి వందనం పథకం కింద సుమారు రూ.33 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు దాదాపు రూ.45 కోట్లు అందించినట్లు వివరించారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లతో 1.36 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు.

రోడ్లు, వీధి దీపాలు, పాఠశాలల అభివృద్ధితో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుంటూరు ఛానల్ విస్తరణకు రూ.275 కోట్లు, ఆధునికీకరణకు రూ.369 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అమృత్–2 పథకం కింద రూ.574 కోట్లతో తాగునీటి సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని వెల్లడించారు. అలాగే గుంటూరు నగరంలో విలీనమైన పాత ఎనిమిది డివిజన్లలో రూ.235 కోట్లతో రహదారులు, మురుగునీటి కాలువలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టినట్లు తెలిపారు.మొత్తంగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి రూ.2,000 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే వివరించారు.

గత ప్రభుత్వ హామీలకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని డా. బూర్ల రామాంజనేయులు అన్నారు. తాము ప్రజలకు ఇచ్చిన మాటలను చేతల్లో చూపిస్తున్నామని, అందుకే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంపై విశ్వాసంతో ఉన్నామని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ లక్ష్యమని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ పనితీరుకు నిదర్శనమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి




**చీరాల, అక్టోబర్ 19 (పెన్ పవర్):**

2027 జనవరిలో అమరావతిలో నిర్వహించనున్న నవ్యాంధ్ర చైతన్య వేదిక 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంపరాల నారాయణమూర్తి, కే. రామచంద్రరావు సంయుక్తంగా పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీనియర్ సిటిజన్స్ సంఘాల నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం చీరాల ఘంటసాల విగ్రహం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వెంపరాల నారాయణమూర్తి, కే. రామచంద్రరావు పాల్గొని 17వ జాతీయ మహాసభలకు సంబంధించిన బ్యానర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2027 జనవరిలో అమరావతిలో మూడు రోజులపాటు "తెలుగు జాతి మనది.. నిండుగా వెలుగు జాతి మనది" అనే నినాదంతో 17వ జాతీయ మహాసభలనునిర్వహించనున్నట్లుతెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా30కేంద్రాల్లో సన్నాహకంగా రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు వివరించారు.2024 నుంచిఅమరావతిరాజధాని అభివృద్ధికి సంబంధించిన సమస్యలనుఒక్కొక్కటిగాపరిష్కరించుకుంటూరాజధాని క్రమక్రమంగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో జాతీయ మహాసభలను అమరావతిలో నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుందని కోట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక తదితర సామాజిక, సాంస్కృతిక సంస్థలను కలుపుకొని కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చీరాల ఘంటసాల సెంటర్ రాష్ట్ర సాంస్కృతిక చైతన్య కార్యక్రమాలకు కేంద్రంగా నిలవడం సంతోషకరమని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో చీరాల సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు గాదె హరిహరరావు, కార్యదర్శి అత్తులూరి రామారావు, కోశాధికారి పాలెపు కనకమోహనరావు, చీరాల ఐక్య వేదిక కమిటీ సభ్యులు పల్లపోలు నాగమనోహర లోహియా, ఊటుకూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విజయదశమి వేళ శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమివ్వనున్న జగన్మాత.. వైభవంగా దసరా ఉత్సవాల ముగింపు వేడుకలు



**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 19,**

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రిమహోత్సవాలువిజయదశమిపర్వదినంతో ముగియనున్నాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.విజయదశమి రోజున భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున రెండున్నర గంటల నుంచే అమ్మవారి దర్శనం ప్రారంభించేందుకుప్రణాళికసిద్ధం చేశారు.నవరాత్రుల సందర్భంగా యాగశాలలో నిర్వహిస్తున్న హోమ క్రతువులు ఉదయం పది గంటల ముప్పై నిమిషాలకు జరిగేమహాపూర్ణాహుతితోముగియనున్నాయి.అనంతరం అమ్మవారికిమహానివేదన సమర్పించనున్నారు.

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఇంద్రకీలాద్రికి విచ్చేసి శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకునిప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.ఇక విజయదశమి వేడుకల్లో ప్రధాన ఘట్టమైన హంసవాహన తెప్పోత్సవం సాయంత్రం కృష్ణా నదిలో వైభవంగా జరగనుంది. సాయంత్రం మూడు గంటల నలభై ఐదు నిమిషాలకు శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం నుంచి స్వామి, అమ్మవార్ల నగరోత్సవం ప్రారంభమై కృష్ణా నది తీరానికి చేరుకోనుంది. సాయంత్రం ఐదున్నర నుంచి ఆరున్నర గంటల మధ్య విద్యుద్దీపాల వెలుగుల్లో అలంకరించిన హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల దివ్య తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నారు.మరోవైపు ఇంద్రకీలాద్రిపై సంప్రదాయబద్ధంగా పంచహారతులు నిర్వహించనున్నారు. తెప్పోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం తిరిగి కొండపైకి తీసుకురానున్నారు.

దసరా ఉత్సవాల ముగింపు ఏర్పాట్లను ఆలయ పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ఇతర అధికారులు మీడియాకు వెల్లడించారు. భక్తులందరూ విజయదశమి వేడుకల్లో పాల్గొని జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ ఆశీస్సులు పొందాలని దేవస్థానం అధికారులు కోరారు.ఇంద్రకీలాద్రిపై విజయదశమి వేడుకలు.. రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో జగన్మాత దర్శనం.. కృష్ణా నదిలో కనులపండువగా హంసవాహన తెప్పోత్సవం.. భక్తిభావంతో ముగియనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు

# స్పెషల్ క్యాంపెయిన్--6లో డీఎస్ఐఆర్ గణనీయ పురోగతి 7,781 ఫైళ్ల సమీక్ష.. 95 ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు

**న్యూఢిల్లీ పెన్ పవర్, అక్టోబర్, 19,**

ప్రత్యేక ప్రచార కార్యక్రమం--6 అమలులో శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన విభాగం (డీఎస్ఐఆర్) గణనీయ పురోగతి సాధించింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ విభాగం అక్టోబర్ 2 నుంచి పరిశుభ్రత, పెండింగ్ అంశాల పరిష్కారం, ఈ--వ్యర్థాల తొలగింపు, సమర్థ రికార్డుల నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ కార్యక్రమాలు చేపడుతోంది.డీఎస్ఐఆర్ కార్యదర్శి మార్గదర్శకత్వంలో, నోడల్ అధికారి పర్యవేక్షణలో సీఎస్ఐఆర్, సీఈఎల్, ఎన్ఆర్‌డీసీ సంస్థల సమన్వయంతో లక్ష్యాల సాధనకు చర్యలు కొనసాగుతున్నాయి. సమీక్షించాలని నిర్దేశించుకున్న 9,805 భౌతిక ఫైళ్లలో ఇప్పటివరకు 7,781 ఫైళ్లను పరిశీలించి, 1,448 ఫైళ్లను తొలగించారు.

ఈ--ఫైళ్ల సమీక్ష, నిబంధనల సరళీకరణలో వందశాతం లక్ష్యాలను సాధించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా ఫిర్యాదులు, అప్పీళ్లలో 95 శాతం పరిష్కరించారు. దేశవ్యాప్తంగా 150 ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలనే లక్ష్యానికి గాను డీఎస్ఐఆర్, సీఎస్ఐఆర్ ప్రధాన కార్యాలయాలు, పరిశోధనశాలల్లోని 95 ప్రాంతాల్లో కార్యక్రమాలు పూర్తయ్యాయి.

ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు రూ.12,08,047 ఆదాయం సమకూరగా, 2,980 చదరపు అడుగుల స్థలం వినియోగానికి అందుబాటులోకి వచ్చింది. మిగిలిన వ్యవధిలో కార్యకలాపాలను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిగా సాధించాలని డీఎస్ఐఆర్ భావిస్తోంది. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన ఆరోగ్యకర భారత నిర్మాణానికి అనుగుణంగా మెరుగైన కార్యాలయ వాతావరణాన్ని కల్పించేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపింది.

# నగర మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణకు మద్దతు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 19,**



గుంటూరు నగర మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కూటమి అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణ అఖండ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కోవెలమూడి లక్ష్మి అపర్ణను తెలుగుదేశం పార్టీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, జిల్లా తెలుగుమహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఘని, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు, జిల్లా అంగన్వాడీ డ్వాక్రా సాధికార ప్రధాన కార్యదర్శి లాం నవమి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి లక్ష్మి అపర్ణ గెలుపు కోసం సమష్టిగా కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు మహానగర సమగ్ర అభివృద్ధికి ప్రజలు మద్దతుగా నిలిచి ఆమెను అఖండ మెజారిటీతో గెలిపిస్తారని ఆకాంక్షించారు.

# మహిషాసుర మర్దిని అవతారంలో శ్రీ వాసవి అమ్మవారు



**వేటపాలెం, అక్టోబర్ 19 (పెన్ పవర్):**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అమ్మవారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని నాళం వెంకట రామకృష్ణ, సూర్యకుమారి సహకారంతో నిర్వహించారు. తెప్పోత్సవం సందర్భంగా అమ్మవారి అలంకరణకు అవసరమైన చీరను బాపనపల్లి రూపేశ్వర్ రావు, లక్ష్మి రత్నమాల అందజేశారు. ఈ విషయాన్ని ఆలయ అధ్యక్షుడు మాజేటి వెంకట సుబ్బారావు, కార్యదర్శి కోడూరి రామకృష్ణ తెలిపారు.

అనంతరం మునుపటి రోజు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైన బాలబాలికలకు బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు ప్రత్తి ముత్తు కుమరన్ చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించినందుకు కరణం బలరామకృష్ణమూర్తికి కృతజ్ఞతలు

**చీరాల, అక్టోబర్ 19 (పెన్ పవర్):**



చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ ఇస్తర్ల షెర్లిని ప్రకటించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం కరణం రెసిడెన్సీలో కుటుంబ సభ్యులతో కలిసి ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు, చీరాల మాజీ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు కరణం బలరామకృష్ణమూర్తికి డాక్టర్ ఇస్తర్ల షెర్లి ధన్యవాదాలు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సు సాంకేతికతతో రొమ్ము క్యాన్సర్ ముప్పును ఐదేళ్ల ముందే గుర్తించే దిశగా కీలక అడుగు

**పెన్ పవర్, అక్టోబర్, 19,**




వైద్య రంగంలో రోజురోజుకూ వస్తున్న విప్లవాత్మక మార్పులు మరియు ఆధునిక సాంకేతిక పురోగతిలో భాగంగా, మానవాళికి ఎంతో మేలు చేసే మరో అద్భుతమైన ఆవిష్కరణ రూపుదిద్దుకుంటోంది. కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఉపయోగించి మహిళల్లో ప్రాణాంతకంగా మారే రొమ్ము క్యాన్సర్ ముప్పును ఏకంగా ఐదు సంవత్సరాల ముందే ముందస్తుగా గుర్తించేందుకు సంబంధించిన పరిశోధనలు ప్రస్తుతం అత్యంత ముమ్మరంగా సాగుతున్నాయి. సాధారణంగా నిర్వహించే మామోగ్రఫీ పరీక్షల్లో సాధారణ కంటికి ఏమాత్రం కనిపించని అత్యంత సూక్ష్మమైన మార్పులు మరియు తేడాలను కూడా ఈ అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ విశ్లేషించగలదు. ఈ ప్రత్యేకమైన అల్గారిథమ్‌ల సాయంతో భవిష్యత్తులో తలెత్తే తీవ్రమైన ముప్పులను మరియు ప్రమాదాలను ముందుగానే కచ్చితంగా అంచనా వేయడానికి వీలవుతుంది. ఈ రకమైన ప్రాణాంతక వ్యాధులను ప్రాథమిక దశలోనే లేదా ముందస్తుగా గుర్తించడం ద్వారా రోగులకు అందించే వైద్య చికిత్స ప్రక్రియ మరింత సులభతరమవుతుంది. తద్వారా రోగులకు సంభవించే ప్రాణాపాయ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకునే అవకాశాలు భవిష్యత్తులో మరింత ఎక్కువగా పెరుగుతాయని వైద్య నిపుణులు భావిస్తున్నారు.

# దాచేపల్లి నగర పంచాయతీలో కూటమి ఏకగ్రీవం!



**పెన్ పవర్, అక్టోబర్, 19,**

పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఎన్నికలకు సంబంధించి మొత్తం మూడు నామినేషన్లు దాఖలు కాగా, నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొప్పుల రవికుమార్‌తో పాటు మరొక స్వతంత్ర అభ్యర్థి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. కేవలం తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థి తంగెళ్ల శ్రీనివాసరావు నామినేషన్ మాత్రమే అధికారికంగా ఆమోదం పొందింది. దీంతో దాచేపల్లి నగర పంచాయతీ కూడా కూటమి ఖాతాలోకి చేరనుంది.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై అవగాహన సదస్సు..

**గొల్లప్రోలు, పెన్ పవర్, అక్టోబర్, 19,**

:గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కె. శైలజ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలన్నారు.ఎంపీడీవో ఎన్. సెలెట్ రాజు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని తెలిపారు. ఇతరులు కోరినా జాబితా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఎస్ఐ ఎన్. రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పోలీసుల నిఘా ఉంటుందని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి కె. శైలజ, ఎంపీడీవో ఎన్. సెలెట్ రాజు, ఎస్ఐ ఎన్. రామకృష్ణ, ఏఓలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కావూరిపాలెంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**చీరాల, అక్టోబర్ 19 (పెన్ పవర్):**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా నవంబర్ 3న జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి చీరాల మండలం కావూరిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి సోమవారం రాత్రి పరిశీలించారు.
చీరాల ఆర్డీఓ నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారిణి ఏ. లక్ష్మితో కలిసి కలెక్టర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, పోలింగ్ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత



అధికారులకు కలెక్టర్ సూచించారు.
ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దుర్గామాత ఆశీస్సులతో జగిత్యాల నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి అందరికీ దసరా శుభాకాంక్షలు – ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్





**పెన్ పవర్, అక్టోబర్, 19,**
జగిత్యాల పట్టణంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివిధ దుర్గామాత మండపాలను సందర్శించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అందరికీ దసరా శుభాకాంక్షలు తెలుపుతూ దుర్గామాత ఆశీస్సులతో జగిత్యాల నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం పాడి పంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని, రైతులకు మంచి దిగుబడులు లభించాలని కోరారు.
ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్లినో ప్రభావం త్వరగా తొలగిపోయి, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు. దుర్గామాత కృపతో జగిత్యాల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది మరింత సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి కౌన్సిలర్ లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విజయదశమి పండుగ: ఆ రోజు చేయకూడని పనులు ఇవే!

**పెన్ పవర్, అక్టోబర్, 19,**
విజయదశమి పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే ఈ పండుగ రోజున, కొన్ని పద్ధతులను పాటించాలని పండితులు సూచిస్తున్నారు. ఈ రోజున మాంసాహారం, మద్యం, ధూమపానానికి దూరంగా ఉండటం, మూగజీవులను హింసించకపోవడం, ఇతరులతో గొడవలకు దూరంగా ఉండటం మంచిదని చెబుతున్నారు. అలాగే ఆయుధ పూజను నిర్వహించి, ఇతరులకు సూది, ఉప్పు, చక్కెర... వంటివి అందించే విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని ఈ వార్త తెలియజేస్తోంది.



# వైసీపీ నేతలపై పోలీసుల లాఠీచార్జ్



**పెన్ పవర్, అక్టోబర్, 19,**
ప్రకాశం జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ పరిశీలన కోసం వెళ్తున్న వైసీపీ చైర్మన్ అభ్యర్థి పోరెడ్డి నరసింహారెడ్డి పత్రాలను టీడీపీ కార్యకర్తలు లాక్కున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో పోలీసులు లాఠీచార్జ్ చేయగా, ఒక వైసీపీ కార్యకర్త కంటికి గాయమైంది. నిరసనగా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయం ముందు బైఠాయించారు. అక్కడ భారీగా వైసీపీ కార్యకర్తలు మోహరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

## కుప్పంలో ఉద్రిక్తత.. టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట

**పెన్ పవర్, అక్టోబర్, 19,**
చిత్తూరు జిల్లాలోని కుప్పం మున్సిపాలిటీ నామినేషన్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్లు దాఖలు చేసేందుకు వస్తున్న అభ్యర్థులను టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో, టీడీపీ, వైయస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ గొడవలో ముగ్గురు టీడీపీ నేతలు, ఇద్దరు వైయస్సార్‌సీపీ వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. పరిస్థితి విషమించడంతో వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి, రెండు వర్గాలను చెదరగొట్టి పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చారు




## అంతరిక్షంలోకి వెళ్లిన తొలి పిల్లి గురించిన చరిత్రాత్మక విశేషాలు



**పెన్ పవర్, అక్టోబర్, 19,**
అంతరిక్ష పరిశోధనలలో భాగంగా 1963 అక్టోబర్ 18న ఫ్రాన్స్ శాస్త్రవేత్తలు 'ఫెలిసెట్' అనే పిల్లిని అంతరిక్షంలోకి విజయవంతంగా పంపారు. వెరోనిక్ రాకెట్ ద్వారా దాదాపు 157 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్న ఈ పిల్లి, కేవలం 13 నిమిషాల అంతరిక్ష ప్రయాణం ముగిసిన తర్వాత భూమికి సురక్షితంగా తిరిగి చేరుకుంది. అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రయాణించి వెళ్లిన మొట్టమొదటి పిల్లిగా ఇది చరిత్ర సృష్టించింది. మానవులు అంతరిక్ష యానాలు చేపట్టడానికి ముందస్తుగా జంతువులపై ప్రయోగాలు నిర్వహించిన కాలంలో, ఫెలిసెట్ చేపట్టిన ఈ అంతరిక్ష ప్రయాణం అంతరిక్ష వాతావరణ పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకోవడంలో అత్యంత కీలకమైన మైలురాయిగా నిలిచింది.

## ఆలూరులో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు, నాయకులు అధికారులకు సహకరించాలి: జి. సునీత

**( కర్నూలు జిల్లా ఇంచార్జ్ ) పెన్ పవర్, అక్టోబర్, 19,**
ఆలూరుస్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటిస్తూ ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారి జి. సునీత సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగాజరిగేందుకుప్రతిఒక్కరూబాధ్యతాయుత ంగా వ్యవహరించాలని ఆమె కోరారు.స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైనవని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల ఎంపిక ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారికి మద్దతు తెలిపే నాయకులు, కార్యకర్తలు ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను తెలుసుకొని వాటికి అనుగుణంగా తమ ప్రచార కార్యక్రమాలను నిర్వహించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఎన్నికల ప్రచార సమయంలో ప్రవర్తనా నియమావళినిఉల్లంఘించే చర్యలకు పాల్పడకూడదని, ప్రచార కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు సంబంధిత నిబంధనలు,అనుమతులనుతప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పరస్పర గౌరవంతో వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలను ప్రలోభాలకు గురిచేసే చర్యలు, ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలిగించే విధానాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.అలాగే ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు జారీ చేసే సూచనలు, ఆదేశాలను అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు గమనించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అనుకూల వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు . అభ్యర్థులు తమ ప్రచారాన్ని నిబంధనలకు లోబడి నిర్వహించుకోవడంతోపాటు ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరిస్తూ అధికారయంత్రాంగానికిపూర్తిసహకారంఅందించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించడం ఒక్క అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ఎన్నికల్లో పాల్గొనే ప్రతి అభ్యర్థి నాయకుడు కార్యకర్తలతో పాటు ప్రజలందరికీ బాధ్యత ఉందని ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారి జి సునీత పేర్కొన్నారు. అందరూ నియమ నిబంధనలను గౌరవించిప్రశాంతవాతావరణంలోఎన్నికలుజరిగేందు కు సహకరించినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆమె తెలిపారు.

## చిప్పగిరి జెడ్పీటీసీ అభ్యర్థిగా శ్రీమతి జ్యోతి. ఎంపీపీ అభ్యర్థిగా కొలిమి సర్వర్ ఖాన్. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రకటించిన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి.

**( కర్నూలు జిల్లా ఇంచార్జ్ ) పెన్ పవర్, అక్టోబర్, 19,**
ఆలూరు నియోజకవర్గం పరిధిలోని చిప్పగిరి మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహాలపై దృష్టి సాధించింది ఇందులో భాగంగా చిప్పగిరి మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా శ్రీమతి జ్యోతిని, ఎంపీపీ అభ్యర్థిగా కొలిమి సర్వర్ ఖాన్‌ను ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రకటించి మాట్లాడుతూ . ఈ ప్రకటనతో చిప్పగిరి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయంగా ఆసక్తి నెలకొంది.
రాబోయే ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికకు ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే విరుపాక్షిఈ నిర్ణయం తీసుకున్నారు. మండలంలో పార్టీ విజయావకాశాలను మెరుగుపరచడం, నాయకులు, కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయడం, గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవడం వంటి అంశాలు స్థానిక ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి.జెడ్పీటీసీ అభ్యర్థిగా శ్రీమతి జ్యోతినిప్రకటించడంతోఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారం అందించడం ద్వారా ఎన్నికల్లో బలంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఎంపీపీ అభ్యర్థిగా





కొలిమి సర్వర్ ఖాన్‌ను ప్రకటించడం ద్వారా మండల పరిషత్ ఎన్నికలపై పార్టీ తన దృష్టిని కేంద్రీకరించింది. ఈ రెండు పదవులకు సంబంధించిన ఎన్నికలు మండల రాజకీయాల్లో ప్రాధాన్యత కలిగినవిగా ఉండటంతో అభ్యర్థుల ప్రకటనకు ప్రాముఖ్యత ఏర్పడింది.

**పార్టీ విజయమే లక్ష్యంగా సమష్టి కృషి**

స్థానికసంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరం. గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రజలకు అందుబాటులో ఉండడం,పార్టీ విధానాలను ప్రజలలోకి తీసుకోవడం ఎన్నికల సమయంలో కీలక పాత్ర పోషిస్తాయి అన్నారు. అభ్యర్థులకు పార్టీ శ్రేణులకు అండగా నిలచి ఐక్యమత్యంతో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సి ఉంటుందన్నారు. చిప్పగిరి మండలం ని వివిధ గ్రామాలలో పార్టీ నాయకుల కార్యకర్తలమధ్యసమన్వయంపెంపొందించుకోవ డం, ఎన్నికలకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగడం అభ్యర్థులకు ముఖ్యమైన అంశాలుగా నిలువ నున్నాయి అన్నారు. అభ్యర్థులకు పార్టీ శ్రేణులకు అండగా నిలిచి ఐక్యమత్యంతో ఎన్నికలలో పాల్గొనడం ద్వారా పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కావున ప్రతి ఒక్క వైఎస్ఆర్సిపి నాయకుడు కార్యకర్త ఒక సైనికుడు నా ముందుకు వెళ్లి వైసిపి అభ్యర్థులను గెలిపించి మన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వవలసిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## లలితా పరమేశ్వరి ఆరాధన (శ్రీవిద్య) అనేది ' గూఢవిద్య"గూఢ గుల్ఫా" అనే నామానికి అర్థం తెలుసుకుందాం






**పెన్ పవర్, అక్టోబర్, 19,**
శ్రీ లలిత రహస్య సహస్ర నామాల్లోని 'గూఢగుల్ఫా' అనే 42 వ నామం అత్యంత నిగూఢమైనది బాహ్యంగా ఇది అమ్మవారి మడమల సౌందర్యాన్ని వర్ణిస్తున్నట్లు ఉన్నా, దీని వెనుక లోతైన ఆధ్యాత్మిక, జ్ఞాన రహస్యాలు దాగి ఉన్నాయి. "గూఢ "అంటే దాచబడిన, రహస్యమైన, బయటకు కనిపించని.
"గుల్ఫా అంటే మడమలు" ఎముకలు బయటకు కనిపించకుండా, మాంసంతో నిండి అత్యంత మృదువుగా, అందంగా ఉన్న మడమలు కలది అని అర్థం.లలితా పరమేశ్వరి ఆరాధన (శ్రీవిద్య) అనేది ' గూఢవిద్య '. దీనిని అందరికీ ప్రదర్శించకూడదు. " గూఢ గుల్ఫా" అంటే అమ్మవారి తత్త్వం అందరికీ సులభంగా అర్థం కాదు. కేవలం అంతర్ముఖులైన సాధకులకు మాత్రమే ఆమె పాదాల చెంత ఉండే ఈ రహస్య జ్ఞానం లభిస్తుంది.
శరీరానికి మడమలు ఎలాగైతే ఆధారాన్ని ఇస్తాయో, సృష్టికి అమ్మవారి శక్తి అలా ఆధారం. కానీ ఆ శక్తి బయటకు కనిపించదు (గూఢము). విశ్వాన్ని నడిపించే పరమాత్మ శక్తి అంతర్లీనంగా ఉంటుందని ఇది సూచిస్తుంది.పూర్వం శిష్యులు గురువుల పాదాల చెంత కూర్చుని విద్యను అభ్యసించేవారు. ' గుల్ఫా' అనేది పాదాల సమీపంలో ఉంటుంది. అమ్మవారి పాదాలను ఆశ్రయించిన వారికి అమ్మ తన రహస్యాలను (గూఢములను) వెల్లడిస్తుందని దీని భావం.శరీరంలో మడమ భాగంలో ఎముకలు బయటకు పొడుచుకు వచ్చినట్లు కనిపిస్తే అది 'కఠినత్వానికి' గుర్తు. అమ్మవారిలో అవి కనిపించకపోవడం ఆమె 'సౌమ్యతకు', 'కరుణకు'నిదర్శనం. జ్ఞాని అయిన వాడు తన పాండిత్యాన్ని బయటకు ప్రదర్శించి ఇతరులను భయపెట్టకూడదు; అతడి జ్ఞానం అమ్మవారి మడమల వలె నిగూఢంగా, ప్రయోజనకరంగా ఉండాలని ఇది బోధిస్తోంది.ఈ ప్రపంచం అంతా బయటకు కనిపిస్తున్నా, దానిని నడిపించే సూత్రాలు రహస్యంగా ఉంటాయి. ఒక విత్తనంలో వృక్షం ఎలాగైతే ' గూఢము'గా ఉంటుందో, పరమాత్మ చైతన్యం ఈ ప్రకృతిలో అలా నిక్షిప్తమై ఉందని ఈ నామం మనకు జ్ఞానోదయం కలిగిస్తుంది.
బాహ్య సౌందర్యం కంటే అంతర్గత పవిత్రత ముఖ్యం. ఎముకలు (కఠినత్వం) కనిపించకుండా ఉండటం అనేది 'ప్రకృతి' యొక్క పరిపూర్ణతకు గుర్తు.
మానవ శరీర బరువును సమతుల్యం చేయడంలో మడమల పాత్ర కీలకం. మానసిక దృక్పథంతో చూస్తే, ఒక మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా (కిరీటం వంటి స్థితి), అతడి పునాది (మడమలు) స్థిరంగా, బలంగా ఉండాలి.కీళ్లు దెబ్బతినకుండా కండరాలు ఎలాగైతే రక్షిస్తాయో, మనలోని సద్గుణాలు మన వ్యక్తిత్వాన్ని అలా రక్షించాలని ఇది సూచిస్తుంది.
ఈ నామం ద్వారా తల్లి మనకు ఇచ్చే గొప్ప సందేశం తెలుసుకుందాము.
భక్తిని ప్రదర్శించకు.నీ పూజలు, నీ జపాలు, నీ దానధర్మాలు ' గూఢము ' గా ఉండాలి. ప్రదర్శన కోసం చేసే భక్తి కంటే, రహస్యంగా చేసే ఆరాధన కే ఫలితం ఎక్కువ.
నీవు మృదువుగా ఉండు. నీ మాటలలో, చేతలలో కఠినత్వం ఉండకూడదు. అందరినీ కరుణతో ఆదరించే గుణాన్ని అలవర్చుకో.
నీ మూలాలను మరవకు.నీ ప్రగతికి కారణమైన మూలాలను రహస్యంగా భద్రపరుచుకో. పునాది బలంగా ఉన్నప్పుడే జీవితం స్థిరంగా ఉంటుంది.
అమ్మవారు తన ' గూఢ గుల్ఫా' స్వరూపం ద్వారా "నీ శక్తిని బాహ్య ప్రదర్శనకు కాకుండా, అంతర్గత వికాసానికి ఉపయోగించు" అని మనకు మార్గనిర్దేశం చేస్తున్నారని సామాజిక వేత్త ఆధ్యాత్మిక వ్యక్తిగా దైవచింతన సనాతన ధర్మ పరిరక్షకులుగా ఆడెపు సంగీత రాజమౌళి ఒక ప్రకటనలో తెలిపారు

## చిన్నారుల ఆహారంలో చక్కెర కట్టడికి భారత ఆహార భద్రతా ప్రమాపాల ప్రాధికార సంస్థ కీలక ఆంక్షలు

**పెన్ పవర్, అక్టోబర్, 19,**
ఆరు నెలల లోపు వయసు ఉన్న శిశువుల ఆహార ఉత్పత్తులలో సుక్రోజ్ మరియు ఫ్రక్టోజ్ వంటి చక్కెరలను కలపడంపై కఠినమైన ఆంక్షలు విధించేందుకు భారత ఆహార భద్రతా ప్రమాపాల ప్రాధికార సంస్థ ఒక సమగ్ర ముసాయిదాను సిద్ధం చేసి ప్రవేశపెట్టింది. ఈ కీలక ప్రతిపాదనకు సంబంధించిన గెజిట్ అక్టోబర్ 16, 2026 నాడే అధికారికంగా ప్రచురితం కాగా, దీనిని కేంద్ర ఆరోగ్య



మంత్రిత్వ శాఖ అక్టోబర్ 17న దేశవ్యాప్తంగా అధికారికంగా ప్రకటించింది. చిన్న వయసులోనే పిల్లలు ఊబకాయం బారిన పడకుండా కాపాడటంతో పాటు, వారిలో తలెత్తే వివిధ జీవక్రియ సమస్యలను సమర్థవంతంగా తగ్గించడమే ఈ నూతన నిబంధన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. వుల ఆహార ఉత్పత్తులను తయారు చేయవలసి ఉంటుంది.

# ప్రపంచబ్యాంక్, ఏడీబీ మెచ్చిన అమరావతి పురోగతి

**విజయవాడ ,అక్టోబరు 19 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో మరో చారిత్రాత్మక ఘట్టం చోటుచేసుకోబోతోంది. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న పనుల వేగం, కార్మికుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ , ఆధునికమౌలిక వసతుల కల్పనపై ప్రపంచబ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ సంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రణాళికాబద్ధమైన నగరాల నిర్మాణంలో అమరావతి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక స్థానాన్నిదక్కించుకోనుందని ఈ అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ప్రతినిధులు ప్రశంసించారు. రాజధాని నిర్మాణం నిధుల కొరత లేకుండా వేగంగా ముందుకు సాగేలా, ఏపీ సీఆర్‌డీఏ కోరిన మరో రూ. 15,000 కోట్లఅదనపు రుణ ప్రతిపాదనలకు ఈ బ్యాంకులు పచ్చజెండా ఊపాయి.ప్రస్తుతం అమరావతిలో రూ. 52,000 కోట్ల అంచనా వ్యయంతో 102 రకాల కీలక పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికేకేటాయించిన నిధులకు అదనంగా మరో రూ. 15,000 కోట్లు అందనుండటంతో హైకోర్టు, అసెంబ్లీ భవనాలు, సచివాలయ ప్రాజెక్టులు, ఐకానిక్ నిర్మాణాలు , ఉద్యోగుల గృహసముదాయాల నిర్మాణాల్లోమరింత పురోగతి రానుంది. ప్రపంచ బ్యాంక్ బృందం ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నాణ్యతను, నిర్దేశిత గడువు ప్రకారం సాగుతున్న తీరును సమీక్షించిన అనంతరం ఈ అదనపు నిధులమంజూరుకు సుముఖత వ్యక్తం చేయడం పనుల పారదర్శకతకు నిదర్శనంగా నిలిచింది.కేవలం భవనాల నిర్మాణమే కాకుండా, రాబోయే తరాలకు అనుగుణంగా గ్రీన్ అండ్ క్లైమేట్–రెసిలెంట్ నగరంగాఅమరావతిని రూపుదిద్దుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఉపయోగిస్తూ, డ్రైనేజీ వ్యవస్థ, ఫ్లడ్ మేనేజ్‌మెంట్ మరియు స్మార్ట్ లాజిస్టిక్స్ కారిడార్లను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నారు. నూతనంగా సమకూరే నిధుల నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌ను నియమించేందుకు సీఆర్‌డీఏ సన్నాహాలు చేస్తోందిఈ భారీ అంతర్జాతీయనిధుల ప్రవాహంతో అమరావతికి మౌలిక సదుపాయాలే కాకుండా, అంతర్జాతీయ పెట్టుబడులు, పారిశ్రామిక పురోగతి , ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతోనిర్మాణం జరుపుకుంటున్న అమరావతి, ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ ఫీల్డ్ ప్లాన్డ్ సిటీల్లో ఒకటిగా నిలిచే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.



# కర్నూలు మేయర్ పీఠం కోసం అత్తాకోడళ్ల పోటీ..

**కర్నూలు,అక్టోబరు 19 పెన్ పవర్:** కర్నూలు రాజకీయాల్లో ఆసక్తికరమైన పోరు తెరపైకి వచ్చింది. మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో వేర్వేరు పార్టీల నుంచి బరిలోకి దిగుతున్న ఇద్దరు మహిళల మధ్య ఉన్న కుటుంబ సంబంధాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఒకరు తెలుగుదేశం పార్టీ తరఫున విజయ ప్రత్యూష కాగా, మరొకరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సుశీల. బంధుత్వం ఒకవైపు.. రాజకీయ ప్రత్యర్థిత్వం మరోవైపు అన్నట్లుగా సాగుతున్న ఈ వ్యవహారం స్థానికంగా ఆసక్తిని పెంచుతోంది.సాధారణంగా ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల మధ్య విమర్శలు, పోటీ సహజమే. అయితే ఒకే కుటుంబానికి చెందినవారు వేర్వేరు పార్టీల తరఫున కీలక పదవుల కోసం పోటీ పడితే ఆ రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారతాయి. కర్నూలు మేయర్ పదవికి సంబంధించి ఇప్పుడు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కుటుంబంలో అత్తాకోడళ్ల వరుసలో ఉన్న ఇద్దరు మహిళలు రాజకీయంగా ఒకరికొకరు ఎదురుగా నిలవడం ఈ పోటీకి ప్రత్యేకతను తీసుకొచ్చింది.తెలుగుదేశం పార్టీ తరఫున ముందుకు వస్తున్న బొల్లెద్దుల విజయ ప్రత్యూషకు గతంలో 52వ వార్డు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఆమె టీడీపీ సీనియర్ నాయకుడు బొల్లెద్దుల రామకృష్ణ కుమార్తె. స్థానిక రాజకీయాలపై అవగాహన, గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం తనకు అనుకూలంగా మారుతాయని ఆమె వర్గం భావిస్తోంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మద్దతు, పార్టీ అధిష్ఠానం ఆశీస్సులు కూడా తన రాజకీయ ప్రయాణానికి బలాన్నిస్తాయని విజయ ప్రత్యూష అనుచరులు ఆశిస్తున్నారు.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సుశీల పేరు చర్చలో ఉంది. ఆమెకు మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ కుటుంబంతో సంబంధాలు ఉండటంతో పాటు, పార్టీ శ్రేణుల మద్దతు తనకు కలిసివస్తుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానికంగా పార్టీకి ఉన్న బలం, నాయకుల సహకారం మేయర్ పదవిని దక్కించుకునే ప్రయత్నంలో కీలకంగా మారవచ్చు. దీంతో ఇరువర్గాల మధ్య పోటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ఇద్దరి మధ్య ఉన్న బంధుత్వమే ఈ వ్యవహారంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. సుశీల కుమారుడిని విజయ ప్రత్యూష సోదరి వివాహం చేసుకుంది. ఈ సంబంధం కారణంగా వీరిద్దరూ అత్తాకోడళ్ల వరుసలోకి వస్తారు. కుటుంబ వేడుకల్లో కలుసుకునే వీరు రాజకీయ వేదికపై ప్రత్యర్థులుగా నిలవాల్సిన పరిస్థితి రావడం స్థానికంగా చర్చలకు దారితీస్తోంది.అయితే మేయర్ పదవిని ఎవరు దక్కించుకుంటారనేది కేవలం కుటుంబ నేపథ్యం లేదా వ్యక్తిగత పరిచయాలపై ఆధారపడి ఉండదు. పార్టీ బలం, కార్పొరేటర్ల మద్దతు, రాజకీయ వ్యూహాలు, ఎన్నికల సమీకరణాలు వంటి అనేక అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి.

**టీడీపీ నుంచి ప్రత్యూష.. వైసీపీ నుంచి సుశీల**

కర్నూలు మేయర్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో టీడీపీ తరఫున బొల్లెద్దుల ప్రత్యూష, వైసీపీ తరఫున ఉతకల్ల సుశీల పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య రాజకీయ ప్రత్యర్థిత్వం ఉన్నప్పటికీ, కుటుంబపరంగా దగ్గరి సంబంధం ఉంది. ప్రత్యూష సోదరి ప్రియాంకను సుశీల కుమారుడు భార్గవ్ వివాహం చేసుకున్నారు. ఈ బంధం కారణంగా సుశీల, ప్రత్యూషకు అత్త అవుతారు. ఇప్పుడు ఒకే కుటుంబానికి చెందిన ఈ ఇద్దరు మహిళలు మేయర్ పీఠం కోసం పోటీ పడుతుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది.ఉతకల్ల సుశీల కుటుంబానికి రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆమె భర్త మణి గాంధీ గతంలో కోడుమూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. సుశీల మామ శిఖామణి కూడా కోడుమూరు నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో సుశీలకు రాజకీయ కుటుంబ నేపథ్యం బలంగా ఉంది.మరోవైపు, బొల్లెద్దుల ప్రత్యూష కూడా రాజకీయాల్లో అనుభవం ఉన్న నాయకురాలే. కర్నూలు 51వ డివిజన్ నుంచి గత ఐదేళ్లపాటు కార్పొరేటర్‌గా పనిచేశారు. ఆమె తండ్రి రామకృష్ణ మంత్రి టీజీ భరత్‌కు అనుచరుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి మద్దతుతో ప్రత్యూషకు మేయర్ అభ్యర్థిగా అవకాశం లభించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**అత్త గెలుస్తుందా? కోడలు విజయం సాధిస్తుందా?**

ఒకవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ.. రెండు పార్టీల మధ్య పోటీకి కుటుంబ బంధం మరింత ఆసక్తిని జోడిస్తోంది. రాజకీయ అనుభవం, పార్టీ బలం, కార్పొరేటర్ల మద్దతు వంటి అంశాలు ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి. చివరకు అత్త సుశీల విజయం సాధిస్తారా? లేక కోడలు ప్రత్యూష మేయర్ పీఠాన్ని దక్కించుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. కర్నూలు మేయర్ ఎన్నికల ఫలితం కోసం రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. ప్రజా సమస్యలపై అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత కూడా నాయకుల రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయగలవు.కర్నూలు నగర ప్రజలకు ఈ పోటీ ఆసక్తికరంగా కనిపిస్తున్నప్పటికీ, చివరకు మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనేది రాజకీయ పరిణామాలపైనే ఆధారపడి ఉంటుంది. కుటుంబ బంధాలు ఎన్నికల పోటీని ఎంతవరకు ప్రభావితం చేస్తాయి? పార్టీ విధేయతకు ఓటర్లు ఎంత ప్రాధాన్యం ఇస్తారు? ఈ ప్రశ్నలకు రాబోయే పరిణామాలు సమాధానం చెప్పనున్నాయి. అత్తాకోడళ్లుగా బంధుత్వం కలిగిన ఈ ఇద్దరు మహిళల రాజకీయ పోటీ కర్నూలు రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందో వేచి చూడాలి.

# పక్కా లోకల్.. సౌండ్ చేయని లోకేశ్

**విజయవాడ ,అక్టోబరు 19 పెన్ పవర్:** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల కోలాహలం నెలకొంది. దాదాపు ప్రతి పార్టీల్లోనూ ఒకటే హడావుడి కనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రతిపక్ష నేత జగన్ తోపాటు రాష్ట్రంలో ఇతర నేతలు అంతా రాజకీయ వ్యూహరచనలో మునిగి తేలుతున్నట్లు కథనాలు వస్తున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక సందర్భంలో ఆయా నేతల ప్రమేయంపై మీడియాలోనూ చర్చలు జరుగుతున్నాయి. అయితే రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన మంత్రి లోకేశ్ పాత్ర మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. స్థానిక ఎన్నికల హంగామా మొదలైన నుంచి మంత్రి లోకేశ్ పేరు ఎక్కడా వినిపించడం లేదు. అసలు ఆయనకు స్థానిక రాజకీయాలతో సంబంధం లేదన్నట్లుగానే వ్యవహరిస్తుండటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై దాదాపు వారం కావస్తోంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగియగా, 21వ తేదీ నుంచి జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇలాంటి కీలక సమయంలో అధికార కూటమితోపాటు విపక్షంలోనూ రాజకీయ చర్చలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా కూటమిలో సీట్ల సర్దుబాటుతోపాటు అభ్యర్థుల ఎంపిక, తిరుగుబాటుదారులను బుజ్జగించే ప్రయత్నాలతో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. కొన్నిసార్లు స్థానిక సర్దుబాట్లు కొలిక్కి రాక అధినేతలు చంద్రబాబు, పవన్ జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. అయితే ఇలాంటి కీలక ఎన్నికల్లో మంత్రి లోకేశ్ పాత్రపై ఎలాంటి ప్రస్తావన రాకపోవడమే రాజకీయంగా ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు.కూటమిలోని ప్రధాన పక్షమైన తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటుగా ఉన్న మంత్రి లోకేశ్ మున్సిపల్ ఎన్నికల చర్చల్లో ఎక్కడా కనిపించకపోవడంపై పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ కు ముందు సీట్ల సర్దుబాటుపై కూటమి పార్టీల మధ్య విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిగినా లోకేశ్ ఏ విషయంలో జోక్యం చేసుకోలేదు. పార్టీ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడును సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించి, మిత్రపక్షాలతో సంప్రదింపుల బాధ్యతను అప్పగించారు. ఇదే సమయంలో పల్లా, నిమ్మల స్థాయిలో పరిష్కారం కాని అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని సర్దుబాటును కొలిక్కి తెచ్చారు.



పార్టీలో కీలక నేతగా ఉన్న లోకేశ్ మాత్రం స్థానిక ఎన్నికల వ్యవహారానికి పూర్తిగా దూరంగా ఉండటమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పార్టీ బాధ్యతలు అన్నీ తన భుజాన వేసుకున్న మంత్రి లోకేశ్.. కీలకమైన ఎన్నికల ప్రక్రియలో అసలు తలదూర్చకపోవడానికి కారణాలు ఏంటి? అన్న చర్చ ఎక్కువగా జరుగుతోంది. అయితే లోకేశ్ జోక్యం చేసుకోకపోవడానికి ఆయన గతంలో చేసిన ఒక ప్రకటన కారణమై ఉండొచ్చునని పరిశీలకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి కూటమి సర్దుబాట్లపై తొందరపాటుతో చేసిన ప్రకటన వల్ల జనసేన, బీజేపీ నాయకులు అంతర్గతంగా తీవ్ర ఇబ్బంది పడ్డారని ఈ కారణం వల్లే ఆయన అనవసర చర్చలకు ఆస్కారం ఇవ్వకూడదనే ఆలోచనతో స్థానిక ఎన్నికల విషయంలో అసలు జోక్యం చేసుకోలేదని అంటున్నారు. అటు పార్టీలోనూ అభ్యర్థుల ఎంపిక విషయంలో స్థానిక నేతలకే పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం వల్ల లోకేశ్ పెద్దగా తలదూర్చాల్సిన అవసరం లేకుండా పోయిందని విశ్లేషిస్తున్నారు. మొత్తానికి కీలక ఎన్నికల సమయంలో మంత్రి లోకేశ్ చర్చ లేకుండా రాజకీయాలు సాగుతుండటమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు.

## ఆక్వా రైతులకు షాక్..

**కర్నూలు,అక్టోబరు 19 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతులకు రొయ్యల మేత కంపెనీలు కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు సరిగ్గా లేక, పెట్టుబడులు రాక ఇబ్బందిపడుతున్న ఆక్వా రంగానికి ఈ మేత ధరల పెంపు ఒక పెద్ద శాపంగా మారింది. నిన్నటి నుంచే అమల్లోకి వచ్చిన ఈ కొత్త ధరల నిర్ణయం పట్ల జిల్లాలోని ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన మరియు అసంతృప్తివ్యక్తం చేస్తున్నారు.ఈ తాజా ధరల పెంపు ప్రకారం, వనామీ రొయ్యల మేత కిలోపై ఏకంగా 9.35 రూపాయలు పెంచారు. దీంతో వనామీ మేత టన్ను ధర ఇప్పుడు ఏకంగా 1.20 లక్షల రూపాయలకుచేరుకుంది. అలాగే టైగర్ రొయ్యల మేత కిలోపై 12.87 రూపాయలు పెంచడంతో, దీని టన్ను ధర ఏకంగా 1.38 లక్షల రూపాయల రికార్డు స్థాయికి చేరింది. ఇలా అడ్డూఅదుపూ లేకుండా మేత ధరలుపెరగడం వల్ల ఎకరానికి అయ్యే పెట్టుబడి ఖర్చు ఊహించని విధంగా పెరిగిపోతుందని రైతులు వాపోతున్నారు.జిల్లాలో ఎక్కువ శాతం మంది రైతులు వనామీ, టైగర్ రొయ్యల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఒకవైపు విద్యుత్ ఛార్జీలు, మందుల ఖర్చులు భారంగా మారిన తరుణంలో, ఇప్పుడు మేత ధరలు కూడా ఈ స్థాయిలో పెరగంతో తాము కోలుకోలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈ మేత ధరల పెంపును నియంత్రించాలని, ఆక్వా రంగాన్ని మరియు రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# రాత్రికి రాత్రే పార్టీ మార్పు.. వైసీపీ కండువా!



**పెనుకొండ,అక్టోబరు 19 పెన్ పవర్:** రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం.. పదవి కోసం పార్టీలు మారడం, రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోవడం సర్వసాధారణం. తాజాగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోచోటుచేసుకున్న పరిణామం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. నిన్నటి వరకు తెలుగుదేశం పార్టీలో కొనసాగిన ఓ నాయకుడు.. టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారి, ఏకంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దిగడం చర్చనీయాంశంగా మారింది.పెనుకొండకు చెందిన బోయ శ్రీనివాసులు అలియాస్ జంపు శ్రీను గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. సుమారు మూడుదశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతున్న ఆయన.. పెనుకొండ మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ తరఫున టికెట్ కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ, చివరకు ఆయనకునిరాశ ఎదురైంది.పెనుకొండ మున్సిపల్ చైర్మన్ టీడీపీ అభ్యర్థిగా త్రివేంద్రమూర్తి పేరును ప్రకటించడంతో జంపు శ్రీను అసంతృప్తికి గురయ్యారు. పార్టీలో ఇన్నేళ్లుగా కొనసాగినా తగిన గుర్తింపు, గౌరవంలభించలేదనే భావనతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.టీడీపీలో చైర్మన్ టికెట్ దక్కకపోవడంతో జంపు శ్రీను వైసీపీ నేతలతో సంప్రదింపులు జరిపినట్లుసమాచారం. అనంతరం మాజీ మంత్రి ఉషశ్రీ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీ మారడమే కాకుండా, పెనుకొండ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూడా ఆయన తెరపైకి రావడంస్థానిక రాజకీయాల్లో అనూహ్య పరిణామంగా మారింది. నిన్నటి వరకు టీడీపీలో చైర్మన్ టికెట్ కోసం ప్రయత్నించిన నాయకుడు.. నేడు అదే పదవి కోసం వైసీపీ తరఫున పోటీకి సిద్ధమవడం రాజకీయవర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.జంపు శ్రీను పార్టీ మార్పుతో పెనుకొండ మున్సిపల్ చైర్మన్ పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. టికెట్ కేటాయింపులు, వ్యక్తిగత రాజకీయ ఆశయాలు, పార్టీ నాయకత్వనిర్ణయాలు స్థానిక రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే చర్చ మొదలైంది. అయితే, ఈ పరిణామం ఎన్నికల ఫలితాలపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. నిన్న ఒక పార్టీ నాయకుడు.. నేడు మరో పార్టీ చైర్మన్ అభ్యర్థి! పెనుకొండలో చోటుచేసుకున్న ఈ రాజకీయ మలుపు మరోసారి రాజకీయాల్లో ఏదైనా సాధ్యమేనని చాటుతోంది.

## వేడెక్కిన రాజకీయం..

**విజయసాయిరెడ్డి, కేశినేని చిన్నిల మధ్య మాటల యుద్ధం**

**విజయవాడ ,అక్టోబరు 19 పెన్ పవర్:** విజయవాడ మేయర్ సీటు కేరాఫ్‌గా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, టీడీపీ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య మాటల యుద్ధం సాగింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకిదిగడం వెనుక టీడీపీ కుట్ర ఉందని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఈ ఆరోపణలపై టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ ఉనికిని చాటుకునేందుకే ా2గా ఉన్న సాయిరెడ్డి తప్పుడుప్రచారాం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. విజయసాయి రెడ్డి కావాలనే టీడీపీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీంతో విజయవాడ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.టీడీపీ అధినేత,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనుసన్నల్లోనే ఏబీవీ వెంకటేశ్వరరావు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారని విజయసాయిరెడ్డి ఆరోపణలు చేశారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వంగవీటిరాధాను జనసేన పార్టీలోకి పంపించి.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఏబీవీని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలపడం చంద్రబాబు మార్కు దుర్మార్గపు రాజకీయానికి నిదర్శనమని విజయసాయి రెడ్డిఅన్నారు. ఏబీవీకి వామపక్షాలు మద్దతు తెలుపుతుండటంపై ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వైసీపీలు అన్నీ ఒక్కటేనని, కలసి రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. 'జగన్ నెవర్‌అగైన్' అని శపథం చేసిన ఏబీవీ ఉద్దేశపూర్వకంగానే రెడ్డి పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేశారని, ఇటువంటి పాలిటిక్స్‌ని ప్రజలు హర్షించరని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.అయితే విజయసాయిరెడ్డికామెంట్స్‌పై కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ ఉనికిని చాటుకునేందుకే ా2గా ఉన్న సాయిరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఏబీ వెంకటేశ్వరరావు ఒక రిటైర్డ్ అధికారి అని,ఆయన వ్యక్తిగత హోదాలో పోటీ చేస్తున్నారని కేశినేని చిన్ని అన్నారు. దీనికి టీడీపీకి ముడిపెట్టడం వైసీపీ కుట్ర అని పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి ఇప్పుడు చీణూ కూటమిలో చిచ్చు పెట్టేందుకు తీవ్రంగాప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విజయసాయిరెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా... ఎంత బురద జల్లినా కూటమి ఐక్యతను దెబ్బతీయలేరని, వంగవీటి రాధాను అత్యధిక మెజారిటీతో మేయర్‌గాగెలిపించుకుని కూటమి పార్టీలు సత్తా చాటుతాయని కేశినేని చిన్ని సవాల్ విసిరారు. అదేవిధంగా అన్నిచోట్ల కూటమి విజయంతో విజయసాయిరెడ్డి లాంటి నోళ్లు మూయిస్తామని ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు.

# 46 ఫోర్లు, 7 సిక్సులతో విధ్వంసం.. 400 రన్స్ కొట్టిన చిన్మయ్ సుతార్




భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన సంచలనం నమోదు అయింది. రంజీ ట్రోఫీ హిస్టరీలో దాదాపు 78 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ మిజోరాం బ్యాటర్ చిన్మయ్ సుతార్ భారీ రికార్డును నెలకొల్పాడు. నాగాలాండ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శనతో ఏకంగా 400ం పరుగులు సాధించి క్వాడ్రపుల్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఈ ఘనత సాధించడంతో రంజీ ట్రోఫీ చరిత్రలోనే 400 రన్స్ మైలురాయిని తాకిన రెండో బ్యాటర్‌గా చిన్మయ్ చరిత్ర సృష్టించాడు.

**9 వికెట్లు పడిపోయినా ఒంటరి పోరాటం:**

ముంబైలో జన్మించి ప్రస్తుతం మిజోరాం తరపున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ మైదానంలో చూపించిన పట్టుదల, పోరాటపటిమ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది.

ఒంటరి పోరాటం: తొలి ఇన్నింగ్స్‌లో మిజోరాం జట్టు 392 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి ఆలౌట్ అయ్యే ప్రమాదంలో పడింది. ఆ సమయంలో మిగిలిన బ్యాటర్లు కేవలం 14 రన్స్ మాత్రమే సహకారం అందించినప్పటికీ, సుతార్ మాత్రం సింగిల్స్, బౌండరీలతో మైదానమంతా పరుగులు రాబట్టాడు.

భారీ స్కోరు: చివరి వికెట్‌కు అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి, జట్టు స్కోరును 581/9 (డిక్లేర్డ్) కు చేర్చాడు. మొత్తం 581 పరుగుల్లో చిన్మయ్ ఒక్కడే ఏకంగా 400 పరుగులు సాధించడం విశేషం.

**ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 10వ బ్యాటర్:**

భారత రంజీ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు కేవలం బీబీ నింబాల్కర్ (దీ. దీ. చీఐఎఝ్రీఝీ) మాత్రమే 400 కంటే ఎక్కువ పరుగులు చేశారు. 1948లో కాథియావాడ్‌పై మహారాష్ట్ర తరపున ఆడుతూ నింబాల్కర్ అజేయంగా 443 రన్స్ కొట్టాడు. ఇప్పుడు దాదాపు ఎనిమిది దశాబ్దాల తర్వాత ఆ రికార్డు సరసన నిలిచిన రెండో భారత బ్యాటర్‌గా చిన్మయ్ నిలిచాడు.

ప్రపంచ ఫస్ట్ క్లాస్ క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 400ం కంటే ఎక్కువ పరుగులు సాధించిన 10వ బ్యాటర్‌గా చిన్మయ్ సుతార్ రికార్డులకెక్కాడు.

**ఇంతకీ ఎవరీ ఈ చిన్మయ్ సుతార్:**

మే 3, 1997న జన్మించిన చిన్మయ్ సుతార్ ముంబైలో పెరిగి, ముంబై జట్టుకే కాకుండా 2019 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భారత్ అండర్ -23 జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం మంచి అవకాశాల కోసం మిజోరాం జట్టులోకి మారిన చిన్మయ్, తన అద్భుతమైన ప్రతిభతో ఇండియన్ డొమెస్టిక్ క్రికెట్‌లో తన ఉనికిని చాటుకున్నాడు.

# స్వర్ణ పతకాలతో దూసుకెళ్తున్న భారత్.. సౌమ్య, రింకు, నిషాద్ అదుర్స్!




జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా పారా గేమ్స్ 2026 లో భారత పారా అథ్లెట్లు సంచలనం సృష్టిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిన అద్భుత విజయాలతో ఇండియా ఖాతాలో పసిడి పతకాలు వచ్చి చేరుతున్నాయి. కేవలం నిమిషాల వ్యవధిలోనే భారత అథ్లెట్లు మూడు స్వర్ణ పతకాలను సాధించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు.

**1500 మీటర్ల పరుగులో సౌమ్య కుమార్‌కి పసిడి:**

మహిళల 1500 మీటర్ల పరుగు పందెంలో తన గైడ్ భారత్ కుమార్ తో కలిసి బరిలోకి దిగిన సౌమ్య కుమార్ అద్భుతమైన టైమింగ్‌తో రేసును ముగించింది. పాయింట్ల ప్రాతిపదికన జరిగిన ఈ హోరాహోరీ పోరులో అగ్రస్థానంలో నిలిచి దేశానికి మరో స్వర్ణ పతకాన్ని అందించింది.

**లాంగ్ జంప్‌లో నిషాద్‌కి గోల్డ్:**

హైజంప్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఉన్న రెండుసార్లు పారాలింపిక్స్ రజత పతక విజేత నిషాద్ కుమార్, తొలిసారి లాంగ్ జంప్ ఈవెంట్‌లో బరిలోకి దిగాడు. ఏమాత్రం తడబడకుండా అద్భుతమైన జంప్ చేసి 7.11 మీటర్ల దూరంతో తొలిసారే పసిడి పతకాన్ని ముద్దాడి సరికొత్త చరిత్ర సృష్టించాడు.

**జావెలిన్ త్రోలో రింకూ సంచలన విజయం:**

పురుషుల ఎఫ్46 జావెలిన్ త్రో ఫైనల్ పోటీ అత్యంత రసవత్తరంగా కొనసాగింది. తోటి భారత అథ్లెట్ అజిత్ సింగ్ చివరి క్షణాల వరకు స్వర్ణ పతకం సాధించేలా కనిపిపించినప్పటికీ, చివరి ప్రయత్నంలో అద్భుతమైన త్రో విసిరిన రింకూ అనూహ్యంగా అజిత్ సింగ్‌ను వెనక్కి నెట్టి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుని స్టేడియాన్ని హోరెత్తించాడు.

# బ్యాక్ టు బ్యాక్ సెంచరీలు.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అదరగొట్టిన రింకు సింగ్.. భారత జట్టులో చోటు దక్కేనా?

టీ20 క్రికెట్‌లో తన సిక్సర్లతో ప్రపంచవ్యాప్తంగా ది బెస్ట్ ఫినిషర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఉత్తరప్రదేశ్ స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ , ఇప్పుడు రెడ్ బాల్ (ఫస్ట్ క్లాస్) క్రికెట్‌లోనూ అద్భుతమైన ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. రంజీ క్రికెట్లో 2026-27 సీజన్‌లో వరుసగా రెండో సెంచరీ సాధించాడు. గోవాతో జరిగిన రంజీ మ్యాచ్‌లో ఒంటరిగా రింకూ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కనీసం 50 ఇన్నింగ్స్‌లు ఆడిన బ్యాటర్లలో అత్యధిక బ్యాటింగ్ యావరేజ్ ఉన్న టాప్-10 ప్లేయర్స్ లిస్టులో 9వ స్థానానికి ఎగబాకాడు. ఈ ఆల్-టైమ్ గ్రేట్ జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

**గోవాతో మ్యాచ్‌లో ఒంటరి పోరాటం:**

గోవాతో జరిగిన రంజీ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ టీమ్ బ్యాటింగ్ విభాగం ఘోరంగా విఫలమైంది. వరుసగా వికెట్లు కోల్పోయి ఒక దశలో 137 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అత్యంత సంయమనం ప్రదర్శిస్తూ 118 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. చివరి వికెట్‌కు వంశ్ చౌదరితో కలిసి విలువైన పరుగులు జోడించి జట్టు స్కోరును 202 పరుగులకు చేర్చాడు.

**వినోద్ కాంబ్లీ రికార్డ్ బ్రేక్ చేసిన రింకు:**

ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో బీహార్‌పై 112 రన్స్ చేసిన రింకూ, తాజాగా గోవాపై 118 నాటౌట్‌తో వరుసగా రెండో శతకాన్ని నమోదు చేశాడు. ఈ అద్భుత ప్రదర్శనతో రింకూ ఫస్ట్ క్లాస్ బ్యాటింగ్ సగటు 61.33కు పెరిగింది. దీంతో అంతకుముందు 59.67 సగటుతో ఉన్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ రికార్డును రింకూ సింగ్ బ్రేక్ చేసేశాడు. ఇప్పటి వరకు 55 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన రింకూ, 78 ఇన్నింగ్స్‌ల్లో 3,987 పరుగులు బాదేశాడు. ఇందులో 11 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యధిక శతకాలు నమోదు చేసిన బ్యాటర్‌గానూ అతను నిలిచాడు.



**ఫస్ట్ క్లాస్ ఆల్-టైమ్ హైయెస్ట్ యావరేజ్ జాబితా:**

డాన్ బ్రాడ్‌మన్ - 95.14
విజయ్ మర్చంట్ - 71.64
జార్జ్ హెడ్లీ - 69.86
అజయ్ శర్మ - 67.46
విలియం పాన్స్ఫోర్డ్ - 65.18
విలియం వుడ్‌ఫుల్ - 64.99
శాంతను సుగ్వేకర్ - 63.10
సర్ఫరాజ్ ఖాన్ - 62.92
రింకూ సింగ్ - 61.33
కే.సీ.ఇబ్రహీం - 61.24

**లాస్ట్11 ఇన్నింగ్స్‌ల్లో రింకు కిరాక్ ఫామ్:**

రింకూ సింగ్ తన చివరి 11 ఫస్ట్ క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 850 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌ల సగటు 94.44గా ఉండటం విశేషం.

కేవలం టీవీల్లో సిక్సర్లు కొట్టే ప్లేయర్‌గానే కాకుండా, రెడ్ బాల్ క్రికెట్‌లోనూ తాను నిలకడగల బ్యాటర్‌నని రింకూ నిరూపించుకుంటున్నాడు. ఈ సూపర్ ఫామ్ చూశాక, భారత టెస్టు జట్టులోకి అతనికి పిలుపు వస్తుందనే చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా కొనసాగుతోంది.

# తమన్నా బోల్డ్ ప్లానింగ్ దిమ్మతిరిగేలా!

దాదాపు 18 ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా.. విభిన్నమైన పాత్రలతో కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. ఒకప్పుడు కమర్షియల్ సినిమాలు, గ్లామర్ పాత్రలు, డ్యాన్స్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామ.. ఇప్పుడు ఓటీటీ, హారర్, బోల్డ్ కంటెంట్ ఉన్న కథలతోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.'లస్ట్ స్టోరీస్ 2', 'జీ కర్దా' వంటి ప్రాజెక్టుల్లో విభిన్నమైన పాత్రలు పోషించిన తమన్నా.. ప్రస్తుతం 'రాగిణి 3'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ హారర్ చిత్రానికి సంబంధించిన షూటింగ్ 2026 జూలైలో ప్రారంభమైంది. 2027లో విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, ఏక్తా కపూర్ 'ది డర్టీ పిక్చర్ 2'ను రూపొందిస్తున్నట్లు ప్రకటించడంతో ఈ సినిమాపైనా ఆసక్తి పెరిగింది. అయితే ఇందులో తమన్నా నటించనున్నారనే వార్తకు ఇంకా అధికారిక ధ్రువీకరణ లేదు.మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా కథలను ఎంచుకుంటున్న తమన్నా.. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలపై దృష్టి సారిస్తున్నారు. కొత్త తరహా కథలతో ఆమె ఎలాంటి విజయాలు అందుకుంటారో చూడాలి.



# ఆ నలుగురు స్టార్ హీరోల ఫ్యాన్స్‌కి బిగ్ గుడ్‌న్యూస్



లీవుడ్‌లో దసరా సందడి కనిపిస్తోంది. బాక్సాఫీస్ వద్ద పలు సినిమాలు సందడి చేస్తున్న విషయం తెల్సిందే. దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవడం కోసం చాలా సినిమాలు విడుదల అయ్యాయి. అందులో కొన్ని సినిమాలను తెలుగు ప్రేక్షకులు తిరస్కరిస్తే, కొన్ని సినిమాలకు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు అవుతున్నాయి. మొత్తానికి టాలీవుడ్ బాక్సాఫీస్ కళకళలాడుతోందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దసరాకు స్టార్ హీరోల సినిమాలు, సూపర్ స్టార్ హీరోల సినిమాలు రాలేదు. అయినా కూడా ప్రేక్షకులు వచ్చిన సినిమాలను చూస్తూ దసరా పండుగ చేసుకునేందుకు సిద్ధం అయ్యారు. ఇక దసరా పండుగ సందర్భంగా స్టార్ హీరోల సినిమాల నుంచి కీలక అప్‌డేట్స్ వస్తాయని ఆయా హీరోల అభిమానులు, మీడియా వర్గాల వారు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**ప్రభాస్ ఫౌజీ, స్పిరిట్ సినిమాల అప్‌డేట్స్...**

ముఖ్యంగా ప్రభాస్ నటించిన ఫౌజీ, స్పిరిట్ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాదిలో ప్రభాస్ నుంచి ఒక సినిమా వస్తుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు. దసరా లేదా దీపావళి వరకు ప్రభాస్ సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ ను ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఇటీవలే ప్రభాస్ స్పిరిట్ సినిమా వచ్చే ఏడాది దీపావళికి విడుదల కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే ఫౌజీ సినిమా విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. దసరా లేదా దీపావళి సందర్భంగా ప్రేక్షకులకు ఆ సినిమా అప్‌డేట్ ఇస్తే తప్పకుండా మంచి రీచ్ ఉంటుంది అనే అభిప్రాయం ను వ్యక్తం చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. అందుకే ప్రభాస్ రెండు సినిమాల అప్‌డేట్స్(టీజర్/పోస్టర్స్) అతి త్వరలోనే రానున్నాయి.

**రంగస్థలం తర్వాత చరణ్-సుకుమార్ కాంబో మూవీ...**

ఇక రామ్ చరణ్, సుకుమార్ కాంబోలో రూపొందుతున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన సైతం ఇదే ఏడాది వస్తుందని తెలుస్తోంది. రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో గతంలో రంగస్థలం సినిమా వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా రామ్ చరణ్‌కి మంచి పేరును తెచ్చి పెట్టింది. ఇక సుకుమార్ దర్శకత్వంలో ఆ తర్వాత వచ్చిన పుష్ప రికార్డ్‌ల వర్షం కురిపించింది. పాన్ ఇండియా రేంజ్‌లో పుష్ప సినిమాను విడుదల చేయడం జరిగింది. అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా అన్ని చోట్ల పుష్ప ప్రభంజనం కనిపించింది. అందుకే రామ్ చరణ్‌తో సుకుమార్ చేయబోతున్న సినిమాను సైతం పాన్ ఇండియా రేంజ్‌లో ప్రేక్షకులు అలరిస్తారనే నమ్మకం వ్యక్తం అవుతుంది. ఆ సినిమా తాలూకు అప్‌డేట్ ను మరికొన్ని రోజుల్లోనే సుకుమార్ అండ్ టీం నుంచి వినబోతున్నాం. మైత్రి మూవీ మేకర్స్ వారు అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎన్టీఆర్, అల్లు అర్జున్‌ల సినిమాల అప్డేట్స్...**

ఎన్టీఆర్, అల్లు అర్జున్‌ల సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ సైతం అతి త్వరలోనే రాబోతున్నట్లు తెలుస్తోంది. చాలా గ్యాప్ తర్వాత ఎన్టీఆర్ డ్రాగన్ షూట్‌లో పాల్గొంటున్నాడు. దసరా కి ప్రత్యేకంగా సర్‌ప్రైజ్ చేయాలనే ఉద్దేశంతో దర్శకుడు ప్రశాంత్ నీల్ వీడియోను రెడీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. పండుగకి ఒక మంచి పోస్టర్ విడుదల చేయడంతో పాటు, సినిమా విడుదల తేదీ, ఇతర విషయాలకు సంబంధించిన వివరాలను క్లారిటీగా చెప్పే అవకాశం ఉంది. కనుక అతి త్వరలోనే ఎన్టీఆర్ ఫ్యాన్స్ కి డ్రాగన్ యూనిట్ నుంచి పెద్ద సర్‌ప్రైజింగ్ న్యూస్ రావడం కన్ఫర్మ్ అయింది. ఎన్టీఆర్-నీల్ కాంబో డ్రాగన్ సినిమా పాన్ ఇండియా రేంజ్‌ను మించి విడుదల కాబోతున్నట్లుగా చెబుతున్నారు. కనుక సినిమా అప్‌డేట్ వస్తుంది అంటే కచ్చితంగా ఫ్యాన్స్ కి పెద్ద గుడ్ న్యూస్ కాదా మరి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న 'రాకా' సినిమా అప్‌డేట్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హాలీవుడ్ రేంజ్ మూవీ అంటూ రాకా గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కనుక రాకా సినిమా నుంచి వచ్చే అప్‌డేట్ కి పాన్ ఇండియా రేంజ్‌లో క్రేజ్ ఉంటుంది. అల్లు అర్జున్ ఫ్యాన్స్ కి అతి త్వరలోనే ఆ రేంజ్ సర్‌ప్రైజ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఒక వైపు రాకా సినిమాతో బిజీగా ఉన్నప్పటికీ అల్లు అర్జున్ నుంచి అతి త్వరలోనే కొత్త సినిమా అప్‌డేట్ వస్తుందనే వార్తలు వస్తున్నాయి. అది కూడా ఈ రెండు మూడు నెలల్లోనే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. అల్లు అర్జున్ కొత్త సినిమా దర్శకుడు ఎవరు, ఇతర అప్‌డేట్స్ ఏంటీ అనేది ఇదే ఏడాది చివరి వరకు వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయి. కనుక అల్లు అర్జున్ ఫ్యాన్స్ కి కూడా అతి త్వరలోనే రెండు బిగ్ గుడ్ న్యూస్ వినిపించే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి నలుగురు స్టార్ హీరోలు వచ్చే ఏడాది బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ఏడాదిలో ఈ స్టార్ హీరోల ఫ్యాన్స్ కోసం బిగ్ అప్‌డేట్స్ వదలబోతున్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com